JAYABHERIDAILY.COM

ప్రభాత జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి I మంగళవారం 24-11-2026

Medchal - Malkajgiri I Tuesday 24-11-2026

Follow: jayabherinews

సంపుటి : 03 I సంచిక : 174

పేజీలు : 8 I వెల : 5

Vol. 03 I Issue 174 I Pages : 8 I ₹: 5



ఆసియాలో భారత్ పవర్‌ఫుల్!

మూడో అత్యంత శక్తిమంతమైన దేశంగా భారత్



- షీ జిన్‌పింగ్ తర్వాత అత్యంత ప్రభావవంతమైన నేతగా మోదీ
- ఆసియాలో రెండో అత్యంత శక్తిమంతమైన నేతగా గుర్తింపు!
- ఆసియా పవర్ ఇండెక్స్-2026లో భారత్‌కు కీలక గుర్తింపు
- ఆర్థిక, దౌత్య, రక్షణ రంగాల్లో భారత్ పురోగతి
- సాంస్కృతిక ప్రభావంలోనూ పెరిగిన పరపతి
- అమెరికాకు చేరువవుతున్న చైనా

✍ జయభేరి, న్యూఢిల్లీ:

ఆసియా ఖండంలో భారత్ తన శక్తి సామర్థ్యాలను మరింత పెంచుకుంటూ ప్రపంచ వేదికపై కీలక స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది. లోవీ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన ఆసియా పవర్ ఇండెక్స్-2026 నివేదికలో భారత్ ఆసియాలో మూడో అత్యంత శక్తిమంతమైన దేశంగా నిలిచింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తర్వాత ఆసియాలో రెండో అత్యంత శక్తిమంతమైన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ గుర్తింపు పొందినట్లు నివేదిక వెల్లడించింది. ఆర్థిక సామర్థ్యం, దౌత్య ప్రభావం, రక్షణ రంగం, సాంస్కృతిక పరపతి వంటి అంశాల్లో భారత్ సాధించిన పురోగతి ఈ గుర్తింపునకు ప్రధాన కారణాలుగా పేర్కొంది. 2018లో ఆసియా పవర్ ఇండెక్స్ ప్రారంభమైనప్పటి నుంచి భారత్, చైనా మధ్య శక్తి అంతరం క్రమంగా తగ్గుతూ వస్తోందని నివేదిక వెల్లడించింది. గత ఎనిమిదేళ్లతో పోలిస్తే ఈ అంతరం ప్రస్తుతం అత్యల్ప స్థాయికి చేరినట్లు పేర్కొంది. అయినప్పటికీ చైనా మొత్తం శక్తి సామర్థ్యం భారత్

...మిగతాది 2 లో



కృష్ణా జలాలపై అసలు దోషులెవరు?

- పాత జీవోలు.. ఒప్పందాలతో కేసీఆర్, హరీశ్ రావులపై సీఎం రేవంత్ గురి!
- పాత జీవోలు.. ఒప్పందాలు.. నీటి వినియోగ గణాంకాలు
- బీఆర్ఎస్ ఆరోపణలకు సీఎం రేవంత్ కౌంటర్.. తెలంగాణ నీటి హక్కులపై రాజకీయ సమరం
- పల్నాడు వాటర్ గ్రిడ్‌పై గత ప్రభుత్వ మౌనమేంటని ప్రశ్న
- 512-298.96 టీఎంసీల ఒప్పందంపై నిలదీత
- ఏపీ, తెలంగాణ నీటి వినియోగ గణాంకాలను బయటపెట్టిన సీఎం
- తెలంగాణ జలహక్కుల పరిరక్షణకు పోరాడతామని స్పష్టీకరణ

✍ జయభేరి, హైదరాబాద్:

కృష్ణా జలాల పంపిణీ విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ విమర్శలు తీవ్రతర మయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెడుతోందన్న బీఆర్ఎస్ ఆరోపణలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, అప్పటి జీవోలు, నీటి పంపిణీ ఒప్పందాలే తెలంగాణకు నష్టం కలిగించాయని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పలు పత్రాలు, గణాంకాలను ప్రస్తావిస్తూ కేసీఆర్, హరీశ్ రావులపై విమర్శలు గుప్పించారు.

పల్నాడు వాటర్ గ్రిడ్ వ్యవహారంపై సీఎం కీలక వివరాలు వెల్లడించారు. 2022 ఫిబ్రవరి 16న అప్పటి ఏపీ సీఎం వైఎస్ జగన్, తెలంగాణ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో జీవో నంబర్ 56 విడుదలైందని తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద పల్నాడు, గుంటూరు జిల్లాల తాగునీటి అవసరాల కోసం రూ.1,200 కోట్లతో ఈ ప్రాజెక్టును రూపొందించారని, కేంద్రం రూ.500 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చేలా నిర్ణయించారని వివరించారు. అప్పట్లో ఈ అంశంపై కృష్ణా బోర్డు లేదా కేంద్రం వద్ద అభ్యంతరం వ్యక్తం చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బోర్డుకు ఫిర్యాదు చేయడంతో పాటు పనులు నిలిపివేయాలని కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2015 జూన్ 26న కేసీఆర్, హరీశ్ రావు కేంద్ర మంత్రి ఉమాభారతి సమక్షంలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 298.96 టీఎంసీల నీటి వాటాకు అంగీకరించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2020 జనవరి 29న ఈ పంపకాలను శాశ్వతంగా కొనసాగించేలా అంగీకరించారని విమర్శించారు. గతంలో తీసుకున్న నిర్ణయాలపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. 2004లో వైఎస్ఆర్ మంత్రివర్గంలో టీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు మంత్రులు ఉన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 11 వేల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచే నిర్ణయానికి అప్పటి ప్రభుత్వంలోనే మార్గం సుగమమైందని ఆరోపించారు. 2005 మార్చి 29న అసెంబ్లీలో చర్చ, సెప్టెంబర్ 13న జీవో విడుదలైన అంశాలను ప్రస్తావించారు. 2004 జూలై 24న హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీల నీటిని తరలించేందుకు జీవో ఇచ్చారని పేర్కొన్నారు.

...మిగతాది 2 లో

రేషన్ కార్డులకు భారీ కత్తెర!

- అనర్హుల ఏరివేతకు కేంద్రం సిద్ధం.. ఈ-కేవైసీతో అసలైన లబ్ధిదారుల గుర్తింపు!
- కారు, ఏసీ ఉన్నవారికీ ఉచిత రేషన్‌నా? దేశవ్యాప్త సర్వేలో విస్తుపోయే నిజాలు!
- 51,303 కుటుంబాలపై సమగ్ర పరిశీలన
- పట్టణ ప్రాంతాల్లో 15.7 శాతం అనర్హులు
- ఉచిత రేషన్‌లో 13.2 శాతం మంది అనర్హులుగా గుర్తింపు
- ఈ-కేవైసీ తప్పనిసరి చేసే యోచన!

✍ జయభేరి, న్యూఢిల్లీ:



దేశవ్యాప్తంగా రేషన్ కార్డుల ప్రక్షాళనకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత రేషన్ ప్రయోజనాలను అర్హులైన పేదలకు మాత్రమే అందించాలనే లక్ష్యంతో అనర్హుల ఏరివేతపై దృష్టి సారించింది. రేషన్ కార్డుల ఆధారంగా అనేక సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతున్న నేపథ్యంలో అర్హత లేని కుటుంబాలను గుర్తించేందుకు కేంద్రం నిర్వహించిన పరిశీలనలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అనర్హులుగా గుర్తించిన వారి కార్డులను తొలగించే దిశగా చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

...మిగతాది 2 లో

జర్నలిస్టులపై వ్యాఖ్యలు.. జేఏసీ సమరభేరి!

2 లో

నెలకు రూ.3 లక్షల జీతం!

ఏపీ యువతులకు జర్మనీలో ఉద్యోగాల బంపర్ ఛాన్స్

- ఏపీ యువతులకు జర్మనీలో ఉద్యోగాల బంపర్ ఛాన్స్!
- నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసిన మహిళలకు సువర్ణావకాశం.. వీసా, విమాన టికెట్ ఖర్చులు ప్రభుత్వానివే!
- జర్మనీలో కొలువులు.. భారీ వేతనాలు.. 8 నెలల పాటు జర్మన్ భాషలో శిక్షణ
- బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం అభ్యర్థులకు అవకాశం.. రెండేళ్ల ఆసుపత్రి అనుభవం తప్పనిసరి.. 18-35 ఏళ్ల మహిళలు అర్హులు

✍ జయభేరి, అమరావతి:



నర్సింగ్ విద్యను పూర్తిచేసి తగిన వేతనంతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఆంధ్రప్రదేశ్ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త అవకాశాన్ని కల్పిస్తోంది. జర్మనీ వంటి విదేశాల్లో నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వేతనంతో ఉద్యోగాలు పొందేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎన్ఎస్‌డీసీ), సాంఘిక సంక్షేమశాఖ, షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. అర్హులైన మహిళలకు జర్మన్ భాషలో శిక్షణ అందించి విదేశాల్లో నర్సింగ్ ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో మూడు ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత ఏడాది పది నెలల పాటు శిక్షణ పొందిన 53 మంది మహిళలు ఇప్పటికే జర్మనీలో ఉద్యోగాలు పొందినట్లు సమాచారం. ఈ ఏడాది మరో 43 మంది శిక్షణ పూర్తి చేసుకుని విదేశీ ఉద్యోగాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మరింత మంది మహిళలకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

మొదటిపేజీ తరువాయి

కృష్ణా జలాలపై అసలు దోషులెవరు?

2023, 24 నీటి వినియోగ గణాంకాలను ప్రస్తావిస్తూ ఏపీ 208.79 టీఎంసీలు వినియోగించుకోగా, తెలంగాణ 119 టీఎంసీలకే పరిమితమైందని సీఎం తెలిపారు. గత పాలనలో ఎస్ఎల్బీసీ, కల్వకుర్తి, నెట్టంపాడు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పూర్తి కాలేదని విమర్శించారు. రాయలసీమలో మాత్రం ఎనిమిది ప్రాజెక్టుల నిర్మాణం వేగంగా సాగిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం భూసేకరణ కోసం రూ.6,765 కోట్లు కేటాయించిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఉద్దండాపూర్‌లో ముంపు బాధితుల పునరావాసం కోసం రూ.600 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను వినియోగించుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. బ్రిజేష్ ట్రిబ్యునల్‌తో పాటు సుప్రీంకోర్టులోనూ తెలంగాణ తరపున బలమైన వాదనలు వినిపిస్తున్నామని సీఎం తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను పలుమార్లు కలిసి రాష్ట్ర నీటి హక్కుల అంశాన్ని వివరించామని చెప్పారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులతోనూ ప్రాజెక్టుల అనుమతులపై చర్చించినట్లు వెల్లడించారు.

కృష్ణా జలాల విషయంలో గత ప్రభుత్వ నిర్ణయాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నలు సంధిస్తుండగా, బీఆర్ఎస్ మాత్రం ప్రస్తుత ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతోంది. రాజకీయ ఆరోపణలకు అతీతంగా తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటా ఎంత? గత ఒప్పందాల ప్రభావం ఏమిటి? ప్రాజెక్టుల వారీగా నీటి వినియోగం ఎలా ఉండాలి? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే అంతిమ లక్ష్యం కావాలి.

ఆసియాలో భారత్ పవర్‌ఫుల్!

కంటే సుమారు 80 శాతం అధికంగా ఉందని వివరించింది. ఆసియాలో తన స్థానాన్ని భారత్ మరింత బలోపేతం చేసుకుంటోందని విశ్లేషించింది. ఆసియా పవర్ ఇండెక్స్ 2026లో 27 దేశాల శక్తి సామర్థ్యాలను ఎనిమిది ప్రధాన విభాగాలు, 131 సూచికల ఆధారంగా అంచనా వేశారు. ఆర్థిక సామర్థ్యం, సైనిక బలం, భవిష్యత్తు వనరులు, దౌత్య ప్రభావం, రక్షణ సంబంధాలు, ఆర్థిక అనుసంధానం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ఎనిమిది విభాగాల్లో ఐదింటిలో భారత్ పురోగతి సాధించగా, మూడింటిలో స్వల్ప క్షీణత నమోదైనట్లు నివేదిక తెలిపింది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ దౌత్య ప్రభావం నిలకడగా కొనసాగుతోందని పేర్కొంది. భారత రక్షణ వ్యవస్థల ఆధునీకరణ, అంతర్జాతీయ రక్షణ ఒప్పందాలు దేశ ప్రతిష్ఠను పెంచుతున్నాయని నివేదిక విశ్లేషించింది. ఆగ్నేయాసియా దేశాలకు బ్రహ్మోస్ క్షిపణుల విక్రయాలు సహా రక్షణ సహకారం పెరగడం వల్ల రక్షణ సంబంధాల విభాగంలో భారత్ తొమ్మిదో స్థానానికి చేరినట్లు పేర్కొంది.

భారత్ సాంస్కృతిక ప్రభావం 43.8 పాయింట్లకు పెరిగినట్లు లోవీ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. సాంస్కృతిక ప్రచారం, సమాచార వ్యాప్తి, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడటం ఇందుకు దోహదపడినట్లు వివరించింది.

అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల అనుసంధానం దేశ ప్రభావాన్ని విస్తరిస్తున్నాయని పేర్కొంది. భారత్ తన శక్తి సామర్థ్యాలను పెంచుకుంటున్నప్పటికీ కొన్ని ఆర్థిక సవాళ్లు కొనసాగుతున్నాయని నివేదిక గుర్తుచేసింది. రూపాయి బలహీనత, అంతర్జాతీయ ద్రవ్య నిధి నిబంధనల్లో మార్పులు, విదేశాలకు వెళ్లే పెట్టుబడుల్లో సుమారు 20 బిలియన్ డాలర్ల తగ్గుదల వంటి అంశాలను ప్రస్తావించింది. పశ్చిమాసియా పరిణామాల సమయంలో భారత్ అనుసరించిన వైఖరి నేపథ్యంలో ప్రధాని మోదీ నాయకత్వం, వ్యూహాత్మక ఆశయాలపై అంచనాల్లో కొంత తగ్గుదల నమోదైనట్లు విశ్లేషించింది.

మరోవైపు ఆసియాలో అమెరికా, చైనాల మధ్య శక్తి సమీకరణాల్లోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. పవర్ ఇండెక్స్‌లో అమెరికా 78.9 పాయింట్లు, చైనా 73.6 పాయింట్లు సాధించాయి. ఈ రెండు దేశాల మధ్య అంతరం కేవలం 5.3 పాయింట్లకు తగ్గింది. అమెరికా ఆర్థిక, సైనిక సామర్థ్యాల్లో ఒత్తిడులు కనిపిస్తుండగా, చైనా తన సైనిక ఆధునీకరణ, నౌకాదళ విస్తరణతో బలాన్ని పెంచుకుంటోందని నివేదిక విశ్లేషించింది. ముఖ్యంగా తైవాన్, ఫిలిప్పీన్స్ ప్రాంతాల్లో చైనా వ్యూహాత్మక ప్రభావం పెరుగుతోందని పేర్కొంది. మొత్తంగా ఆసియాలో మారుతున్న శక్తి సమీకరణాల్లో భారత్ తనదైన ముద్ర వేస్తోంది. చైనాతో ఉన్న అంతరాన్ని తగ్గించుకుంటూ ఆర్థిక, దౌత్య, రక్షణ రంగాల్లో ఎదుగుతున్న భారత్‌కు భవిష్యత్తులో మరింత విస్తృత అవకాశాలు ఉన్నాయని లోవీ ఇన్‌స్టిట్యూట్ నివేదిక సూచిస్తోంది. అయితే ఈ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలంటే ఆర్థిక వృద్ధి, సైనిక సామర్థ్యం, అంతర్జాతీయ సంబంధాల విషయంలో నిరంతర పురోగతి అవసరం.

నెలకు రూ.3 లక్షల జీతం!

ఈ ఉద్యోగావకాశాలకు దరఖాస్తు చేసుకునే మహిళలు గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఆసుపత్రిలో కనీసం రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి. అభ్యర్థుల వయసు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. అర్హతలు కలిగిన మహిళలు ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందేందుకు అవకాశం ఉంటుంది. జర్మనీలో ఉద్యోగం చేయడానికి అవసరమైన భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఎంపికైన అభ్యర్థులకు ఎనిమిది నెలల పాటు ప్రత్యేక శిక్షణ అందిస్తారు. ఏ1, ఏ2, బీ1, బీ2 అనే నాలుగు స్థాయిల్లో జర్మన్ భాషను బోధిస్తారు. ఇందుకోసం నలుగురు అనుభవజ్ఞులైన శిక్షకులను నియమించారు.

బీ2 స్థాయి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి విదేశీ ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. విదేశాలకు వెళ్లాలంటే వీసా, విమాన టికెట్ల కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందన్న ఆందోళన అభ్యర్థుల్లో ఉంటుంది. అయితే ఈ కార్యక్రమంలో ఎంపికైన వారికి జర్మనీ వెళ్లేందుకు అవసరమైన వీసా, విమాన టికెట్ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు వెల్లడించారు.

దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే అర్హులైన మహిళలకు కూడా విదేశీ ఉద్యోగాలు పొందే అవకాశం లభించనుంది. స్థానికంగా నర్సింగ్ ఉద్యోగాల్లో లభించే వేతనాలతో పోలిస్తే జర్మనీలో అధిక ఆదాయం పొందే అవకాశం ఉండటంతో ఈ కార్యక్రమం మహిళలకు ప్రయోజనకరంగా మారనుంది. నైపుణ్య శిక్షణ, భాషా పరిజ్ఞానం, విదేశీ ఉద్యోగ అనుభవం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇది దోహదపడుతుంది. అర్హత ఉన్న మహిళలు అధికారిక నోటిఫికేషన్, దరఖాస్తు విధానం, ఎంపిక నిబంధనలను సంబంధిత ప్రభుత్వ శాఖల ద్వారా తెలుసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రేషన్ కార్డులకు భారీ కత్తెర!

దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 51,303 లబ్ధిదారుల కుటుంబాలపై కేంద్రం సమగ్ర సర్వే నిర్వహించినట్లు నివేదిక వెల్లడించింది. పట్టణ ప్రాంతాల్లోని ప్రాధాన్యతా కుటుంబాల్లో 15.7 శాతం మంది అనర్హులుగా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద ఉచిత రేషన్ పొందుతున్న వారిలోనూ అర్హత లేని కుటుంబాలు ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైంది. ఆర్థికంగా స్థోమత కలిగిన కుటుంబాలు సైతం ఉచిత రేషన్ ప్రయోజనాలను పొందుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించినట్లు సమాచారం. కారు, ఏసీ వంటి సౌకర్యాలు ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం రేషన్ కార్డులు కలిగి ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి అనర్హుల కారణంగా ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడటమే కాకుండా నిజమైన పేదలకు అందాల్సిన ప్రయోజనాలు పక్కదారి పడుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సర్వే వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 39.5 శాతం మంది అనర్హులుగా ఉన్నట్లు గుర్తించారు.

త్రిపురలో 39.2 శాతం, తమిళనాడులో 38.7 శాతం, మేఘాలయలో 28.5 శాతం మంది అర్హత లేని లబ్ధిదారులుగా ఉన్నట్లు నివేదిక వెల్లడించినట్లు సమాచారం. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద ఉచిత రేషన్ పంపిణీలో జాతీయ స్థాయిలో 13.2 శాతం మంది అనర్హులుగా ఉన్నట్లు పరిశీలనలో తేలినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రేషన్ కార్డుల వివరాలను మరోసారి ధ్రువీకరించాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అర్హతలను పరిశీలించడం, ఈకేవైసీ ప్రక్రియను తప్పనిసరి చేయడం వంటి చర్యలపై మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం ఉంది. అనర్హులుగా గుర్తించిన వారి రేషన్ కార్డులను తొలగించేందుకు రానున్న రెండు నెలల్లో ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రం యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ మేరకు తుది మార్గదర్శకాలు, రాష్ట్రాల వారీగా అమలు విధానం వెల్లడికావాల్సి ఉంది. నిజమైన పేదలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలంటే అనర్హుల ఏరివేత అవసరమే. అయితే ఈ ప్రక్రియలో అర్హులైన పేదలు, వృద్ధులు, నిరుపేద కుటుంబాలకు అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కేవలం సర్వే ఆధారంగా కాకుండా ఆదాయం, కుటుంబ పరిస్థితులు, ప్రభుత్వ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా రేషన్ కార్డుల ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరం ఉంది.

లాభాలే ముఖ్యమా.. బాధ్యతలు పట్టవా?

- కార్పొరేట్లకు ప్రధాని మోదీ సూటి ప్రశ్నలు
- కం పెనీల ఖజానాలు నిండుతున్నాయి.. ఉద్యోగుల జీతాలు ఎందుకు పెరగడం లేదు?
- ఉపాధి కల్పనపై పరిశ్రమలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం!



దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశ్రామిక, కార్పొరేట్ సంస్థలకు ప్రధాని నరేంద్ర మోదీ సంధించిన ప్రశ్నలు ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కేవలం పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన సూచనలు మాత్రమే కాదు.. దేశ ఆర్థికాభివృద్ధిలో కార్పొరేట్ రంగం నిర్వర్తించాల్సిన సామాజిక బాధ్యతను గుర్తుచేసే హెచ్చరికలు కూడా. కంపెనీల లాభాలు ఏటికేడు పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నాయి. అయినా కొత్త ఉద్యోగాల కల్పన ఎందుకు ఆశించిన స్థాయిలో జరగడం లేదు? ఉద్యోగుల వేతనాలు కంపెనీల లాభాల పెరుగుదలకు అనుగుణంగా ఎందుకు పెరగడం లేదు? దేశీయ మార్కెట్‌లో బలమైన స్థానం ఉన్న భారతీయ సంస్థలు ప్రపంచ మార్కెట్లలో మరింత దూకుడుగా ఎందుకు ముందుకు సాగడం లేదు? అన్న ప్రధాని ప్రశ్నలు కార్పొరేట్ రంగం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి.

202425 ఆర్థిక సర్వే గణాంకాలు పరిశీలిస్తే కార్పొరేట్ రంగంలో లాభాల వృద్ధి, ఉపాధి కల్పన మధ్య ఉన్న అంతరాలు స్పష్టమవుతున్నాయి. కంపెనీల లాభాలు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 4.8 శాతానికి చేరుకున్నాయని, లాభాల వృద్ధి 22.3 శాతంగా నమోదైందని నివేదిక పేర్కొంది. అయితే ఉపాధి వృద్ధి మాత్రం 1.5 శాతానికే పరిమితమైంది. ఉద్యోగుల వ్యయాలు 13 శాతం పెరిగినప్పటికీ నామమాత్రపు వేతన వృద్ధి సుమారు 5 శాతంగానే ఉందన్న గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కంపెనీల ఆదాయాలు, లాభాలు పెరుగుతున్నప్పుడు ఆ ఫలితాల్లో ఉద్యోగులకు తగిన వాటా ఎందుకు దక్కడం లేదన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతోంది.

పరిశ్రమల్లో పెట్టుబడులు పెంచడం, తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా 2019లో కేంద్ర ప్రభుత్వం సాధారణ దేశీయ కంపెనీలకు కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించింది. పన్ను విధానాల్లోనూ పలు సంస్కరణలు చేపట్టింది. మరోవైపు వ్యక్తిగత ఆదాయపు పన్ను విధానంలోనూ ఉపశమన చర్యలు తీసుకుంది. ఈ రాయితీలు పరిశ్రమలకు పెట్టుబడులు విస్తరించేందుకు, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకు, కొత్త ఉద్యోగాలు సృష్టించేందుకు ఉపయోగపడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. అయితే పన్ను తగ్గించినంత మాత్రాన ప్రతి కంపెనీ వెంటనే ఉద్యోగాలను పెంచాలనడం సమంజసం కాదు. మార్కెట్ డిమాండ్, అంతర్జాతీయ పరిస్థితులు, ముడిసరుకు ధరలు, వడ్డీరేట్లు వంటి అంశాలు పెట్టుబడి నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. అయినప్పటికీ ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందుతున్న సంస్థలు ఉపాధి కల్పన, పెట్టుబడులు, ఉత్పాదకత విషయంలో తమ ఫలితాలను పారదర్శకంగా వెల్లడించాల్సిన బాధ్యత ఉంది.

భారతీయ వినియోగదారుల నాణ్యతా ప్రమాణాలను తక్కువగా అంచనా వేయవద్దన్న ప్రధాని సూచన కూడా కీలకమైనది. విదేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులకు అత్యుత్తమ నాణ్యతను పాటిస్తూ, దేశీయ మార్కెట్‌లో మాత్రం తక్కువ ప్రమాణాల వస్తువులను విక్రయించడం సరైన వ్యాపార విధానం కాదు. భారతీయ వినియోగదారుడికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులను అందించాలి. నాణ్యత, సాంకేతికత, ధర, సేవల విషయంలో ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునే సామర్థ్యాన్ని దేశీయ పరిశ్రమలు పెంచుకోవాలి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా లభించే అవకాశాలను కూడా కేవలం దిగుమతులకే పరిమితం చేయకుండా ఎగుమతుల విస్తరణకు ఉపయోగించుకోవాలి.

ఫార్మా ముడిసరుకులు, ప్రత్యేక ఉక్కు, అల్యూమినియం వంటి కీలక రంగాల్లో దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవాలని ప్రధాని సూచించడం ఆర్థిక స్వావలంబన దిశగా ముఖ్యమైన అడుగు. విదేశీ దిగుమతులపై అధికంగా ఆధారపడటం వల్ల అంతర్జాతీయ పరిణామాలు దేశీయ పరిశ్రమలపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అదే సమయంలో వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమల్లోనూ కార్పొరేట్ పెట్టుబడులు పెరగాలి. రైతులకు మెరుగైన మార్కెట్లు, నిల్వ సదుపాయాలు, ఆధునిక సాంకేతికత, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి అవకాశాలు కల్పించాలి. ఈ రంగాల్లో పెట్టుబడులు పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించడంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి.

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశాల్లో ఒకటి. ఏటా లక్షలాది మంది విద్యార్థులు చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం మార్కెట్‌లోకి వస్తున్నారు. వీరందరికీ తగిన నాణ్యమైన ఉద్యోగాలు కల్పించడమే దేశం ముందున్న ప్రధాన సవాలు. కేవలం అత్యాధునిక సాంకేతిక రంగాల్లో ఏర్పడే ఉద్యోగాలతోనే నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేం. తయారీ పరిశ్రమలు, ఆధునిక సేవారంగాలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించాలి. అప్రెంటిస్‌షిప్, వృత్తి విద్య, నైపుణ్య శిక్షణకు పరిశ్రమలు మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. లేకపోతే దేశానికి అనుకూలంగా ఉన్న యువ జనాభా ప్రయోజనం ఒక పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉంది.

గత 1213 ఏళ్లలో సరైన విధానాల వల్ల సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధాని పేర్కొన్నారు. ఈ ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లడంలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు రంగానికీ కీలక బాధ్యత ఉంది. కంపెనీలు తమ వాటాదారులకు లాభాలు అందించడమే కాకుండా ఉద్యోగులకు న్యాయమైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, ఉపాధి భద్రత కల్పించాలి. ఉత్పత్తి పెరుగుదలతో పాటు ఉద్యోగుల కొనుగోలు శక్తి కూడా పెరిగేలా చూడాలి. ఎందుకంటే ఉద్యోగులే వినియోగదారులు. వారి ఆదాయం పెరిగితేనే మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. డిమాండ్ బలపడుతుంది. తద్వారా పరిశ్రమలకు మరింత వ్యాపారం, పెట్టుబడులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయి. కంపెనీల లాభాలు పెరగడం తప్పు కాదు. అవి దేశ ఆర్థిక వ్యవస్థకు అవసరమే. కానీ ఆ లాభాల ఫలాలు కొద్దిమందికే పరిమితమైతే సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు. ప్రభుత్వ రాయితీలతో పెరిగిన పారిశ్రామిక సామర్థ్యం ప్రజలకు ఉపాధి, ఉద్యోగులకు మెరుగైన వేతనాలు, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తుల రూపంలో తిరిగి అందాలి. పరిశ్రమల అభివృద్ధి అంటే కేవలం కంపెనీల బ్యాలెన్స్ షీట్లలో లాభాలు పెరగడం కాదు.. సామాన్యుడి జీవన ప్రమాణాలు మెరుగుపడటం కూడా. లాభాలు ముఖ్యం.. కానీ ప్రజల ప్రయోజనాలు అంతకంటే ముఖ్యం. కార్పొరేట్ రంగం ఈ వాస్తవాన్ని గుర్తించినప్పుడే దేశ ఆర్థిక ప్రగతికి నిజమైన అర్థం చేకూరుతుంది.

జర్నలిస్టులపై వ్యాఖ్యలు.. జేఏసీ సమరభేరి!



- ఉమ్మడిగా గళమెత్తిన ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ
- జర్నలిస్టుల ఆత్మగౌరవంతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరిక
- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పీఆర్ఓ హరికృష్ణ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం
- వి. నాగరాజుపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- జర్నలిస్టులంటే అంత చులకనా? ప్రజల గొంతుకను అవమానించే అధికారం ఎవరిచ్చారు?
- మునుగనూరు ఇళ్ల స్థలాల వ్యవహారంలో జర్నలిస్టులకు అన్యాయం జరిగిందని ఆవేదన

✍ జయభేరి, ఎల్బీనగర్, నవంబర్ 23:

ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే జర్నలిస్టుల గొంతుకను అవమానిస్తే సహించేది లేదని, పత్రికా స్వేచ్ఛను కించపరిచే ఏ ప్రయత్నాన్నైనా ఐక్యంగా ఎదుర్కొంటామని ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్టు జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. జర్నలిస్టులపై ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పీఆర్ఓ హరికృష్ణ చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత, అసందర్భ వ్యాఖ్యలపై జేఏసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జర్నలిస్ట్ వి. నాగరాజుపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎల్బీనగర్‌లోని శ్రీకాంతాచారి చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ధోరణిని విడనాడాలని, ప్రజా సమస్యలను ప్రశ్నించే మీడియాను రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా చూడటం మానుకోవాలని హెచ్చరించారు.

జేఏసీ చైర్మన్ రాజు మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఉన్నది ఉన్నట్లుగా రాస్తేనే కొందరికి మింగుడు పడటం లేదని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం కూడా తప్పయిపోయిందా? అని నిలదీశారు. మునుగనూరు ఇళ్ల స్థలాల వ్యవహారంలో ఎమ్మెల్యే పీఆర్ఓ హరికృష్ణ వ్యవహరించిన తీరు, జర్నలిస్టుల పట్ల చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డారు. జర్నలిస్టులను కించపరిచేలా మాట్లాడటం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులనే అవమానిస్తే ప్రజాస్వామ్యానికి విలువ ఎక్కడ ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక జర్నలిస్టుకు జరిగిన అవమానాన్ని వ్యక్తిగత సమస్యగా చూడబోమని, అది యావత్ జర్నలిస్టు సమాజ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. ఈరోజు ఒకరిని అవమానిస్తే రేపు మరొకరిని లక్ష్యంగా చేసుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బాధ్యత తీసుకోవాలని, తన పీఆర్ఓ వ్యవహారశైలిపై మండిపడ్డారు. జర్నలిస్టులను అవమానించే వ్యాఖ్యలకు రాజకీయ అండదండలు ఉన్నాయనే భావన కలిగేలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. సంబంధిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఎల్.బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జేఏసీ కార్యకర్త, ప్రింట్ అండ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు, స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక సంపాదకులు ఎస్‌బీఎన్ చారి మాట్లాడుతూ.. జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని వెనకేసుకొచ్చే ధోరణి మానుకోవాలని, జర్నలిస్ట్ వి. నాగరాజుపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గతంలో తాము చేసిన పోరాటం ఎమ్మెల్యేకు తెలియదా? అని ప్రశ్నించారు. ఆనాడు తమ పరిస్థితి 'దేవుడు కరుణించినా పూజారి కనికరించలేదు' అన్న చందంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి నిత్యం ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేస్తూ, ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరిస్తూ వార్తా కథనాలు అందించే జర్నలిస్టుల పట్ల ఇంతటి వివక్ష ఎందుకని నిలదీశారు.

ఎల్బీనగర్ నియోజకవర్గంలో జర్నలిస్టులు ఎదగడం, వారి సంక్షేమం కోసం ముందుకు రావడం కొందరికి ఇష్టం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జర్నలిస్టుల అభివృద్ధి తమ రాజకీయ ఉనికికి ప్రమాదమనే భావనతోనే పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం, మహేశ్వరం నియోజకవర్గంలో అప్పటి జిల్లా మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవ తీసుకుని స్థలాలు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. పక్క నియోజకవర్గాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించినప్పుడు ఎల్బీనగర్‌లో మాత్రం ఎందుకు ఇంతటి జాప్యం జరిగిందని ప్రశ్నించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే ఎమ్మెల్యే సొంత ఆస్తులు ఏమైనా కరిగిపోతాయా? అని ఘాటుగా నిలదీశారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులే వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే పరిస్థితి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

జేఏసీ కళా సాంస్కృతిక సారథి కడారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునుగనూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 90, 91లో ఎమ్మెల్యే అనుచరులకు, ఎమ్మెల్యే పీఆర్ఓకు ఇళ్ల స్థలాలు అందించిన తీరును తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తమ పోరాటం ఎవరికీ వ్యతిరేకం కాదని, జర్నలిస్టులకు న్యాయంగా దక్కాల్సిన హక్కుల కోసమేనని స్పష్టం చేశారు. జర్నలిస్టులకు కూడు, గుడ్డతో పాటు గూడు కూడా అవసరమని, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇళ్ల స్థలాలు కల్పించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోకుండా, వారితో విరోధభావంతో వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పందించి జర్నలిస్టులతో స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు.

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు, ఇళ్ల స్థలాల అంశంలో జరిగిన పరిణామాలపై జేఏసీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను గౌరవించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, మీడియాను తమకు అనుకూలంగా ఉన్నప్పుడే గౌరవించడం, ప్రశ్నించినప్పుడు అవమానించడం తగదని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క



ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వినతి

✍ జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 23:

యాదగిరిగుట్ట మండలంలోని కాచారం గ్రామానికి చెందిన మహ్మద్ ఫాతిమా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్తకు రెండు కాళ్లు లేవని,దాంతో కుటుంబ పోషణ మొత్తం తన మీదే పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉంటున్న ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతోందని తెలియని స్థితిలో ఉందని వాపోయారు. ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల సహకారంతో బీస్మింట్ వరకు నిర్మించామని తెలిపారు. పూర్తిగా ఇల్లు నిర్మించుకునే స్తోమత లేదని,తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

యాదాద్రిలో కార్తీక పౌర్ణమికి భారీ ఏర్పాట్లు

- ఉ.5 గంటల నుంచే శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు ప్రారంభం



✍ జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 23 :

కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో భారీ ఏర్పాట్లు చేసినట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. సోమవారం సత్యనారాయణ వ్రత మండపంతో పాటు భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఈవో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి,అమ్మవార్ల దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని,భక్తుల రద్దీ కనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గత సంవత్సర కార్తీక పౌర్ణమి నాడు వచ్చిన భక్తుల రద్దీతో పాటు, ప్రస్తుత కార్తీక మాసంలో శని ,ఆదివారాలు,ఇతర సెలవు దినాలలో వచ్చిన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పెద్ద సంఖ్యలో భక్తులు

శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించుకునే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వ్రతాలను సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వ్రత పూజల నిర్వహణకు అవసరమైన పూజా సామాగ్రిని కూడా ముందుగానే సిద్ధం చేయించినట్లు తెలిపారు. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని మంగళవారం తెల్లవారుజాము 5 గంటల నుంచే శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎస్ఐ కు ఘన సన్మానం



✍ జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా రూరల్ ఎస్ ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేష్‌ను సోమవారం దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ గ్రామానికి చెందిన చందూగౌడ్ ఘనంగా సన్మానించారు. ఎస్ ఐ వెంకటేష్‌కు ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు.

యాదాద్రికి కార్తీక మాసం వైభవం

- కార్తీక సోమవారం కావడంతో కిటకిటలాడిన భక్తులు
- శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.62.26 లక్షలు

✍ జయభేరి, యాదగిరిగుట్ట :



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం కార్తీక మాసం వైభవంతో అలరారుతోంది. పవిత్రమైన కార్తీక సోమవారం కావడంతో యాదగిరీ శ్రీనారసింహుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి స్వామి,అమ్మవార్ల దర్శనానికి భారీగా భక్తులు తరలిరావడంతో యాదగిరికొండ కిటకిటలాడింది. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు కోరిన కోరికెలు తీరాలని స్వామి, అమ్మవార్లను వేడుకున్నారు.

కొండపైన కొలువైన

శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో భక్తులు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా భక్తులు దర్శించి తరించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి కొండపైన,కొండ కింద పలు ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది. సోమవారం ఒక్కరోజే 928 శ్రీసత్యనారాయణ వ్రతాలు జరుపుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



కొనసాగుతున్న నిత్యపూజలు..

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యాదగిరీశుడి నిత్యరాబడి..

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి సోమవారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్యరాబడిలో భాగంగా స్వామి, అమ్మవార్లకు రూ.62,22,538 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,38,850,బ్రేక్ దర్శనం ద్వారా రూ.6,60,900, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.15,42,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.8,14,950, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.4,20,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.76,716,ప్రసాద విక్రయం ద్వారా రూ.11,47,100,కల్యాణకట్ట ద్వారా రూ.50,400తోపాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఈ 144 సర్వేనెంబర్ లో నాలా కన్వెన్షన్ లేదు

- నాల కన్వెన్షన్ లేదు ఎఫ్ టీఎల్ పరిధిలో పరిశ్రమ నిర్మాణాలా?
- పరిశ్రమ నిర్మాణంతో చెరువు కాలుష్యం, ప్రజారోగ్యానికి ముప్పు
- పరిశ్రమ నిర్మాణ పనులకు గ్రామస్తుల అడ్డుకట్ట!
- అంతారెడ్డిగూడెంలో నికోమాక్-తైకిషా పనులు నిలిపివేయాలని డిమాండ్
- చెరువు కాలుష్యం, ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉందని ఆందోళన
- సర్పంచ్ రాధా శేఖర్, నేరెట్ల మహేందర్ గౌడ్, వెంకటేష్ ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్
- ఈ నిర్మాణానికి నాలా కన్వెన్షన్ లేదు, ఎఫ్ టీఎల్ లో ఉన్న అలాగే నిర్మాణాలు

✍ జయభేరి, షాబాద్, నవంబర్ 23 :





గ్రామ ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు వాటిల్లేలా పరిశ్రమల నిర్మాణాలు చేపడితే సహించేది లేదని అంతారెడ్డిగూడెం గ్రామస్తులు హెచ్చరించారు. షాబాద్ మండలం అంతారెడ్డిగూడెం గ్రామ పరిధిలో నిర్మిస్తున్న నికోమాక్-తైకిషా పరిశ్రమ పనులను గ్రామస్తులు సోమవారం అడ్డుకుని తమ నిరసన వ్యక్తం చేశారు. నిర్మాణాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారమే పనులు జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు విచారణ జరిపే వరకు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సర్పంచ్ రాధా శేఖర్, మహేందర్ గౌడ్‌తో పాటు పలువురు గ్రామస్తులు నిర్మాణ ప్రాంతానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 147లో నాలా కన్వర్షన్, బఫర్ జోన్ పరిధిలో వ్యవసాయ భూమిని లీజుకు తీసుకుని నికోమాక్-తైకిషా సంస్థ కాంక్రీట్ నిర్మాణ పనులు చేపడుతోందని వారు ఆరోపించారు. పరిశ్రమ నిర్మాణం, కార్యకలాపాల వల్ల వెలువడే దుమ్ము, ధూళి, కంకర పొడి గ్రామ పరిసరాలకు వ్యాపించి ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పరిశ్రమకు సమీపంలోనే చెరువు ఉండటంతో వ్యర్థాలు, కాలుష్యకారకాలు నీటిలోకలిస్తే పశుపక్ష్యాదులు, ఇతర జీవరాశులకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. నాలా కన్వర్షన్ బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? వ్యవసాయ భూమిలో పరిశ్రమ నిర్మాణానికి సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకున్నారా? అనే విషయాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని సర్పంచ్ రాధా శేఖర్, గ్రామస్తులు డిమాండ్ చేశారు. నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి రెవెన్యూ, నీటిపారుదల, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఘనంగా ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభం

- అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం

✍ జయభేరి, షాబాద్, నవంబర్ 23 :



షాబాద్ మండలం పోతుగల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉపసర్పంచ్ నేరెట్ల సావిత్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి స్పెషల్ క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

శ్రీనివాస్ మాట్లాడుతూ..పథకం లక్ష్యాలు, అర్హతలు, ప్రయోజనాలను వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని, ప్రతి ఒక్కరూ నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవరాం, వార్డు సభ్యులు కుమ్మరి చంద్రశేఖర్, కేశపల్లి కరుణాకర్ రెడ్డి, పలుగుట్ట వనజరాజు, పామెన రాజు, గ్రామ పెద్దలు గుట్టల క్రిష్ణయ్య, నాగరకుంట మహేందర్, ముక్కిడి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా అయ్యప్ప పడి పూజా మహోత్సవం

- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి

✍ జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 23:

యాదగిరిగుట్ట పట్టణంలో అయ్యప్ప పడి పూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వామి పెండెం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుండ్లపల్లి సత్యం,సాయి సన్నిధానంలో పడిపూజను నిర్వహించారు. 200 మంది అయ్యప్ప మాల ధారణ స్వాములతో గణపతి ,సుబ్రహ్మణ్యం, అయ్యప్ప స్వాములకు అంగ పూజ,అష్టోత్తరం, నమస్కార శ్లోకాలతో పూజించి,18 రకాల అభిషేకాలను నిర్వహించారు. అభిషేకం అనంతరం 18 మెట్లకు పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయం అధ్యక్షుడు సుడుగు శ్రీనివాస్ రెడ్డి,పబ్బాల రాజు,నాగరాజు,ప్రసాద్, లవ్వయ్య,కనక రాజు,కృష్ణ రెడ్డి,నవీన్,బాబురావు, వెంకటేష్,ధార నవీన్, భాస్కర్,మల్లారెడ్డి, శ్రీనివాస్,బాలరాజు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి బీఆర్ఎస్ నేత వాసం రమేష్ స్వగృహంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, కరువు పోయి తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా కురవాలని,ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపైన ఐక్యంగా ఉద్యమించాలి



✍ జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 23 :

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ ఆలిండియా కౌన్సిల్ సభ్యుడు కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. డిసెంబర్ 1, 2, 3తేదీలలో జరిగే ఢిల్లీని ఆక్రమించండి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీని ఆక్రమించండి కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రీమియర్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయు జనరల్ సెక్రటరీ సి.హెచ్.రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, నేతలు వెంకటేష్, గణేష్, నగేష్, సురేందర్, స్వామి,శ్రీనివాస్ రెడ్డి, గంగయ్య, నరేష్, సురేష్, ఐలయ్య, అన్నపూర్ణ, లలిత, సులోచన, రఫీ, ప్రణీత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాబాల్లో దర్జాగా మద్యం దందా..!

- వైన్స్ ల నుండి తెచ్చి అమ్మకాలు
- పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు



✍ జయభేరి, వలిగొండ నవంబర్ 23:

మండల పరిధిలోని రోడ్లపై దాబాలలో మద్యం అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్లు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. పీకల్లోతువరకు మద్యం తాగి ఎన్నో గొడవలకు దిగుతున్నారని ఆరోపణలు ఎన్నో ఉన్నాయి. వాహనదారులు సైతం రోడ్డు పక్కనే ఉన్న దాబాల్లో మద్యం సేవించి ప్రమాదాల బారిన పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. యువత పూర్తిగా మద్యానికి బానిసై ప్రతిరోజు ఏదో ఒకచోట ఈ యాక్సిడెంట్ లు జరుగుతూనే ఉన్నాయి మరి వీరి ప్రాణాలకు ఎవరు బాధ్యులు మరి దాబాలపై చర్యలు లేవా..? పట్టించుకునే వారే లేరా అని ప్రజలు ఆరోపిస్తున్నారు వలిగొండ క్రాస్ రోడ్డు నుండి తొర్రూర్ కు వెళ్లే రహదారి వెంట ఫ్యామిలీ దాబాల పేరుతో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నడుస్తున్న అధికారులు ఏం చేస్తున్నట్లు అని ప్రజలు చర్చించుకోవడం సర్వసాధారణం అయిపోయింది దాబాలను అరికడితే కొంతమేరకు యువతను రక్షించుకోవచ్చని ప్రజల నుంచి వినిపిస్తున్న సమాచారం. దీనిపై స్పందించి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధురాలికి వీల్ చైర్ అందజేత

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు కృతజ్ఞతలు తెలియజేసిన వృద్ధురాలు

✍ జయభేరి, సిరిసిల్ల :

వృద్ధురాలి ఇబ్బందిపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పందించి.. సమస్యకు పరిష్కారం చూపారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్ కు చెందిన కొండ లలితవ్వ వృద్ధురాలు సోమవారం ఐడీఓసీకి రాగా, ఆమెతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు? ఏ సమస్యపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తక్షణమే స్పందించి కొండ లలితవ్వకు వీల్ చైర్ అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. వృద్ధురాలికి వెంటనే వీల్ చైర్ జిల్లా కలెక్టర్ అందజేశారు. తన సమస్య, ఇబ్బందిని అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో స్పందించి వీల్ చైర్ అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు వృద్ధురాలు కృతజ్ఞతలు తెలియజేశారు.



అంజన్ కుమార్ యాదవ్‌కు స్వాగతం

- ఘనంగా సత్కరించిన తూంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్..
- కట్టమైసమ్మ ఆలయంలో అంజన్ కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు..

✍ జయభేరి, మేడ్చల్, నవంబర్,23:

సదర్ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొనేందుకు కరీంనగర్‌కు వెళ్తున్న మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్‌కు సోమవారం తూంకుంటలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా తూంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం శామీర్‌పేటలోని కట్టమైసమ్మతల్లి ఆలయంలో అంజన్‌కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌదాని భూమన్న యాదవ్, మేకల వీరన్న యాదవ్, రవి యాదవ్, గంట రాములు యాదవ్, వెంకటేష్ యాదవ్, బి. పరమేష్, బి. మహేష్, ఎం. బిక్షపతి, ఏ. శ్రీనివాస్ యాదవ్, ఎం. మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి లభ్యత, భూసారానికి అనుగుణంగా పంటలు సాగు చేయాలి: మాధవరెడ్డి

- నూతన్‌కల్‌లో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన



✍ జయభేరి, మేడ్చల్, నవంబర్, 23:

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని మేడ్చల్ మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి సూచించారు. ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మేడ్చల్ మండలం నూతన్‌కల్ గ్రామంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ అధిక నీటి వినియోగం అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల వేరుశనగ, నువ్వులు, మినుములు, ఉలవలు, శనగ వంటి పంటలను ఎంచుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని నేల స్వభావం, పోషకాల లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. పంటల దిగుబడి పెంపులో పశువుల ఎరువు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పశువుల ఎరువు వినియోగం వల్ల నేల భౌతిక, రసాయన లక్షణాలు మెరుగుపడటంతో పాటు, రసాయన ఎరువుల్లోని పోషకాలు మొక్కలకు సమర్థవంతంగా అందుతాయని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకొని పంటల మార్పిడి విధానాన్ని అనుసరించాలని, తక్కువ పెట్టుబడితో అధిక ప్రయోజనం పొందేలా వ్యవసాయ ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ మాధవరెడ్డి, ఏఈఓ నీరజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రేమ, ఆప్యాయత అందించడమే నిజమైన సేవ

- డాక్టర్ హేమారెడ్డి



✍ జయభేరి, మేడ్చల్, నవంబర్, 23 :

వృద్ధాప్యంలో ఉన్న పెద్దలకు ప్రేమ, ఆప్యాయత, ఆదరణ అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అవని హాస్పిటల్ డైరెక్టర్, నిత్య సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ డాక్టర్ హేమారెడ్డి అన్నారు. సోమవారం నిత్య సాయి ఛారిటబుల్ ట్రస్ట్ అనుబంధ సంస్థ ఏబీ హాస్పిటల్ ఆధ్వర్యంలో కండ్లకోయలోని జ్ఞానాశ్రమం వృద్ధాశ్రమంలో ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. హేమారెడ్డి మాట్లాడుతూ వృద్ధాశ్రమాల్లో ఉంటున్న పెద్దలతో కొంత సమయం గడపడం, వారి కష్టసుఖాలను తెలుసుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు. వృద్ధులు ఒంటరివారమనే భావనకు గురికాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా వారి ముఖాల్లో చిరునవ్వులు చూడటం ఆనందంగా ఉందని, భవిష్యత్తులోనూ నిత్య సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాఘవ, సీఈఓ శ్రీమతి హరిణి దంతులూరి, అవని హాస్పిటల్ డైరెక్టర్, నిత్య సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ డాక్టర్ హేమారెడ్డి, జ్ఞానాశ్రమం చైర్మన్ ఆర్. శ్రీహరి రాజు తదితరులు పాల్గొన్నారు. ఏబీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది వృద్ధులకు సేవలందించారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ జన్మదిన వేడుకలు

✍ జయభేరి, గుడిపల్లి :

గుడిపల్లి మండల కేంద్రంలో ఘనంగా మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ జన్మదిన వేడుకలు మండల కేంద్ర సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అరవపల్లి సరిత నరసింహ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి మాజీ సర్పంచ్ మోపురి ఆంజనేయులు గణపురం మాజీ సర్పంచ్ తోటకూరి పరమేష్ గుడిపల్లి గ్రామ ఉప సర్పంచ్ అరవపల్లి శ్రీనయ్య వార్డు సభ్యులు ఎర్ర మహేశ్వరి రామలింగం కత్తుల రమేష్ బోడ నాగరాజు ఎర్ర వంశీకృష్ణ గణపురం రాధిక యాదగిరి వట్టెపు శ్రీను వడ్లపల్లి శ్రావణ్య శ్రీనివాస్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ బోడ లక్ష్మమ్మ మాజీ ఉపసర్పంచ్ కొమిరి రాంబాబు మలికిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి జానపాటి వెంకటయ్య గణపురం సైదులు గణపురం యాదయ్య పోలే వెంకట్ యాదవ్ బోర్రయ్య జగదీశ్వర్ రెడ్డి వట్టెపు శివ యాదగిరి ఎర్ర సైదులు ముత్తయ్య యాదయ్య విష్ణుమూర్తి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హెరిటేజ్ వ్యాలీ ది ఇండియన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

- విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, మార్చ్‌పాస్ట్‌తో అలరించిన చిన్నారులు.. ప్రతిభకు పట్టం కట్టిన యాజమాన్యం
- క్రమశిక్షణ, అంకితభావం, ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలి – బ్రిగేడియర్ ఎం.కె. ఎస్. మౌళి



✍ జయభేరి, షాద్ నగర్, నవంబర్ 23 :

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ, వారిలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా షాద్‌నగర్‌లోని హెరిటేజ్ వ్యాలీ - ది ఇండియన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఉత్సాహం మధ్య సందడిగా సాగాయి. విద్యార్థుల అద్భుతమైన ప్రదర్శనలు, ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు, క్రమశిక్షణతో కూడిన మార్చ్‌పాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నేడు నేర్చుకోండి.. రేపు నాయకత్వం వహించండి...

స్ఫూర్తిదాయకమైన ఇతివృత్తంతో నిర్వహించిన ఈ వార్షికోత్సవం విద్యార్థులకు తమలోని నైపుణ్యాలను ప్రదర్శించేందుకు చక్కటి వేదికగా నిలిచింది. విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే సామర్థ్యాన్ని, సమాజానికి ఉపయోగపడే నాయకత్వ లక్షణాలను అందించాలనే సందేశాన్ని ఈ వేడుకలు చాటిచెప్పాయి. ఈ కార్యక్రమానికి బ్రిగేడియర్ ఎం.కె.ఎస్. మౌళి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాల యాజమాన్యం ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. అనంతరం విద్యార్థుల క్రమశిక్షణ, సమన్వయం, అంకితభావాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన మార్చ్‌పాస్ట్‌తో వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, క్రమపద్ధతిలో మార్చ్‌పాస్ట్‌లో పాల్గొని అతిథులు, తల్లిదండ్రుల ప్రశంసలు అందుకున్నారు.వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ నృత్యాలు, ఆధునిక నృత్యాలు, గాన ప్రదర్శనలతో చిన్నారులు తమలోని కళాత్మక ప్రతిభను అద్భుతంగా ఆవిష్కరించారు. ప్రతి ప్రదర్శనలోనూ విద్యార్థుల సాధన, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం స్పష్టంగా కనిపించింది. వేదికపై విద్యార్థులు ప్రదర్శించిన ఆత్మవిశ్వాసం, సమన్వయం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా భారతదేశ ఆకృతిలో విద్యార్థులు రూపొందించిన ప్రత్యేక ఫార్మేషన్ దేశభక్తి, జాతీయ సమైక్యత, ఐక్యతా భావాన్ని చాటుతూ అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది.విద్యా, క్రీడా, సాంస్కృతిక తదితర రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల కృషిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించేలా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. తమ ప్రతిభకు గుర్తింపు లభించడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బ్రిగేడియర్ ఎం.కె.ఎస్. మౌళి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సమయపాలన, అంకితభావం వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే నిరంతర కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తనకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్య సాధన కోసం కష్టపడి పనిచేయాలని అన్నారు. అపజయాలకు భయపడకుండా వాటిని విజయానికి మెట్లుగా భావించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు హితవు పలికారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి సరైన దిశలో ప్రోత్సహించినప్పుడే వారు భవిష్యత్తులో సమాజానికి, దేశానికి ఉపయోగపడే నాయకులుగా ఎదుగుతారని పేర్కొన్నారు.పాఠశాల డైరెక్టర్, వ్యవస్థాపకురాలు జ్యోతి గురువారా, డైరెక్టర్లు అనుజ్ గురువారా, అన్మోల్ గురువారా, ప్రిన్సిపాల్ ప్రదీప్ మిస్త్రీ ఈ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తూ వారి ప్రతిభను అభినందించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం ఈ వేడుకల ద్వారా చాటిచెప్పింది.అనంతరం డైరెక్టర్ అనుజ్ గురువారా కృతజ్ఞతా ప్రసంగం చేస్తూ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రిగేడియర్ ఎం.కె.ఎస్. మౌళికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వారికి నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అందించేందుకు పాఠశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మొత్తంగా హెరిటేజ్ వ్యాలీ - ది ఇండియన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టడంతో పాటు విద్య, సంస్కృతి, క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాల సమ్మేళనంగా నిలిచాయి. విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలు, ముఖ్య అతిథి సందేశం, అవార్డుల ప్రదానోత్సవంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. నేటి విద్యార్థులే రేపటి నాయకులనే సందేశాన్ని చాటుతూ ఈ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బీసీ కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

✍ జయభేరి, దేవరకొండ :



దేవరకొండ బీసీ కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయాలి సత్యాగ్రహ దీక్షలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టడం జరిగింది ఈ సత్యాగ్రహ దీక్షను బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిలియన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు బిఆర్ ఎస్ నాయకులు మల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేతావత్ బిలియనాయక్ , బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రక్షణమే నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి ఎనిమిది వేల కోట్ల పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల యొక్క భవిష్యత్తు పునాది వేయాలని లేకపోతే విద్యార్థుల అక్రోసానికి తప్పదని కొండమల్లేపల్లి దేవరకొండ నియోజకవర్గం బాలికల ఫ్రీ మెట్రిక్ హాస్టల్ లో ప్రారంభించాలని ఉన్నటువంటి కళాశాల హాస్టల్లకు సొంత భవనాలు నిర్మించాలని ఈ ప్రాంతంలో అత్యధికంగా ఉన్నటువంటి బిసి జనాభాను ప్రాతిపదికగా తీసుకొని బీసీ ఆత్మగౌరవం కోసం బీసీ భవనాన్ని నిర్మించాలని బీసీలకు ఉన్నటువంటి అన్ని సమస్యల్లో న్యాయం చేయాలని లేనట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేస్తామని తక్షణమే ఆశల నిర్మాణం బీసీ భవన నిర్మాణం చేయకపోతే బీసీల్లో యొక్క ఆకురోషానికి గురికా వద్దని ప్రభుత్వాన్ని ప్రతినిధులను సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో దీక్షలో కూర్చున్నటువంటి వారు డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ అబ్దుల్ కలాం ఏనుగుల వెంకటేష్ చిట్టి మల్ల సురేష్ దండే కార్ పెంటోజి దుడ్డు దశరథ వెంకులు తూటు పల్లి శీను బొమ్ము శ్రీనివాస్ అప్పం వీరయ్య మునగాల గణేష్ అనానీయ విద్యార్థులు గుండెబోయిన అంజలి యాదవ్ బట్టు అశ్విని నల్ల గాసు నందిని యాదవ్ బచ్చన బోయిన పూజ గుండెబోయిన దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

✍ జయభేరి, తిరుపతి :



ప్రజలకు అన్ని రకాల ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో తిరుపతి నగరంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూఐడీఏఐ డైరెక్టర్ రామకృష్ణ తమ్మిశెట్టి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తిరుపతి సుబ్బారెడ్డి నగర్, అక్కారంపల్లిలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కేంద్రంలో కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్,వ్యక్తిగత వివరాల సవరణ తదితర ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆధార్ కేంద్రం ఆదివారంతో సహా ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటాదన్నారు .ఈ కార్యక్రమంలో యూఐడీఏఐ హైదరాబాద్ అధికారులు, జావేద్,తిరుపతి మేనేజర్ మునిరాజా,ఆపరేషన్స్ మేనేజర్ డి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లేబర్ రూమ్స్‌లో యువతి ఆత్మహత్య

- రాయిచందని మాల్ సమీపంలోని గదిలో ఉరివేసుకుని బలవన్మరణం

✍ జయభేరి, మేడ్చల్, నవంబర్ 23:

పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. రాయిచందని మాల్ సమీపంలోని లేబర్ రూమ్స్‌లో దశమ ముండా అలియాస్ పింకీ (24) అనే యువతి సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం నవంబర్ 23న ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో యువతి తన గదిలో ఉరివేసుకుని కనిపించింది. సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

బండి.. గ్రాండ్ సక్సెస్

- 3 రోజుల్లోనే మహా పాదయాత్రను సూపర్ హిట్ చేసినవ్



✍ జయభేరి, కరీంనగర్ :

కరీంనగర్ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ లో నిర్వహించిన 'మహా పాదయాత్ర' ఘన విజయం సాధించింది. పాదయాత్ర అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ లో సేదతీరిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సాయంత్రం 4.45 గంటలకు కలెక్టరేట్ హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి బయలుదేరారు. హెలికాప్టర్ ఎక్కే ముందు ఆనందంతో బండి సంజయ్ ను ఆలింగనం చేసుకున్న నితిన్ నబిన్... "బండి జీ.... మహా పాదయాత్రను గ్రాండ్ సక్సెస్ చేసినవ్. 3 రోజుల ముందే షెడ్యూల్ ఫిక్స్ చేసినప్పటికీ ఇంత పెద్దగా సక్సెస్ చేసినవ్. మర్చిపోలేని అనుభూతి కలిగింది. కరీంనగర్ కార్యకర్తల్లో నేనెక్కడా చూడని జోష్ కనిపించింది. ప్రజా స్పందన బ్రహ్మాండంగా ఉంది" అని ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు జరిగిన మహా పాదయాత్రల్లో కరీంనగర్ పాదయాత్రే 'టాప్' అని సీనియర్ నాయకులు, పార్టీ పరిశీలకులు పేర్కొన్నారు.

PUBLIC NOTICE

General Public are hereby inform that my client GANESH SINGH, S/o. Late. BALAJI SINGH, R/o. H.No.1411120, Machilipura, Boriyagalli, Mangalhat, Hyderabad500012, T.G., have paid substantial amount as advance towards part of sale consideration to purchase the House Property bearing Municipal No.132697 (PTIN No.1071320305), admeasuring 95.00 Sq. yards equivalent to 79.48 Sq. metres, situated at Muchkunda Nagar, Rahimpura, Karwan, Hyderabad, Hyderabad, Telangana State, from: PANDYA YADAGIRI, S/o. Late. P. KISHAN alias P. KRISHNA, R/o. H.No.132697, Muchkunda Nagar, Rahimpura, Hyderabad 500006, T.G.

If any person/s, organization/s, institution/s having any objection/ right / titles / interests / claims, etc., in respect of the above said property, they may contact the undersigned address with all relevant original documents in support of their claims within Seven (07) days from the date of this Publication. Failing which my client shall proceed with the sale transaction and any objections raised thereafter shall not be entertained.

Sd/
SHASHIKANTH TIWARI
Advocate
91184, Street No.3, Lalitha Nagar, Langer House, Hyderabad500008, T.S.
Cell No.9849236974.



కార్తీక మాసంలో దీపారాధన చీకటిని తొలగించే జ్ఞానం

✍ జయభేరి, దేవరకద్ర :

కార్తీక మాసంలో దీపారాధన చీకటిని తొలగించే జ్ఞానం అని అంటారు. కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. దీనికిగాను శివాలయాలను ముస్తాబు చేశారు. పుణ్యం, ఆధ్యాత్మిక వెలుగును ప్రసాదిస్తుందని పురాణాలు, శాస్త్రాలు చెబుతున్నాయి. శివుడు అగ్ని జ్యోతిర్లింగ రూపంలో దర్శనమిచ్చిన సందర్భాన్ని కార్తీక దీపం గుర్తు చేస్తుంది. అరుణాచల కొండపై మహాదీపం వెలిగించడం ఈ సంప్రదాయానికి ప్రతీక.అగ్ని ఆరాధన. కార్తీక మాసంలో వచ్చే కృత్తికా నక్షత్రం అగ్నిదేవుడికి ప్రతీక. చలి పెరిగే ఈ కాలంలో దీప రూపంలో అగ్నిని ఆరాధించడం విశేషం.దీపపు వెలుగు మనసులోని అజ్ఞానం, అహంకారం అనే చీకటిని తొలగించి శాంతి, శ్రేయస్సును తెస్తుందని విశ్వాసం.

ముఖ్యమైన దీప సంప్రదాయాలు 365 వత్తుల దీపం

ఏడాదిలోని 365 రోజులకు గుర్తుగా కార్తీకంలో ముఖ్యంగా పౌర్ణమి నాడు 365 వత్తులతో దీపం వెలిగిస్తారు.ఇది ఏడాది పొడవునా దీపారాధన చేసిన పుణ్యాన్ని ఇస్తుందని భక్తుల నమ్మకం. తెలుగు మరియు.ఈ ఆచారం శివకేశవుల అనుగ్రహానికి ప్రతీకగా నిలుస్తుంది.

ఉసిరి దీపం..

కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు విశేష ప్రాధాన్యత ఉంది. ఉసిరికాయలో నెయ్యి పోసి వత్తితో దీపం వెలిగించడం శుభప్రదంగా భావిస్తారు.తులసి కోట ముందు దీపం.సంధ్యా సమయంలో తులసి మొక్క ముందు దీపం వెలిగించడం ఇంట్లో శుభాలను, లక్ష్మీ కటాక్షాన్ని కలిగిస్తుందని విశ్వసిస్తారు. కార్తీకంలో దీపారాధన అనంతమైన పుణ్యాన్ని అందిస్తుంది.



పర్వదిన వేడుకలకు వాసవి మాత ఆలయం ముస్తాబు..

కార్తీక పౌర్ణమి సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయం కార్తీక పౌర్ణమి రోజున ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ తరిమల హరిశంకర్ శర్మ గారి ఆధ్వర్యంలో ప్రదోష కాలమందు పార్థివ,సాలగ్రామ,నర్మదా బాణ శివలింగాలకు రుద్రాభిషేకం మరియు 108 పుణ్యశ్రీ మూర్తులచేత 108 మంది లక్ష్య దీపాలతో కలిపి కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ప్రధాన అర్చకుడు హరిశంకర్ తరిమల (ప్రధానార్చకులు) తెలిపారు.

ఆదర్శ పంచాయితీగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

- రామనపల్లి తెలుగుదేశం పార్టీ సర్పంచు అభ్యర్థిగా సుమక్క నామినేషన్ దాఖలు



✍ జయభేరి, అగళి, నవంబరు 23 :

అగళి మండలం రామనపల్లి తెలుగుదేశం పార్టీ సర్పంచు అభ్యర్థిగా ఎన్నికైన సుమక్క సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న సర్పంచు ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి సుమక్కను అఖండ మేజరిటి గెలుపు దిశగా అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలనీ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పిలుపు నిచ్చారు. తెలుగుదేశం పార్టీ సర్పంచు అభ్యర్థి సుమక్క మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామ అభివృద్ధికి తనకు ఒక అవకాశం కల్పించి, సర్పంచ్‌గా గెలిపించాలని రామనపల్లి గ్రామ ప్రజలను కోరారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి భారీ నిధులు మంజూరు చేయాలి

- ముగ్గురు రాష్ట్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- రూ.44 కోట్లతో పంచాయతీరాజ్ పనులు.. రూ.86 కోట్లతో గిరిజన సంక్షేమ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు
- మణుగూరు ఆసుపత్రిని 150 పడకలకు, గుండాల పీహెచ్‌సీని 30 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి
- ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మంత్రులు



✍ జయభేరి, మణుగూరు :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు, గిరిజన ప్రాంతాల్లో విద్యా సౌకర్యాల కల్పన లక్ష్యంగా పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులను కలిసి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు.

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు రూ.44 కోట్ల ప్రతిపాదనలు

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం సుమారు రూ.44 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనలను సమర్పించారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి, బీటీ రోడ్ల నిర్మాణం, హైలెవల్ బ్రిడ్జిలు, చెప్టాలు, కల్వర్టుల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, ఈఓ భవనాలు తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామీణ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగించి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఈ పనులు ఎంతో అవసరమని వివరించారు.

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు రూ.86 కోట్ల ప్రతిపాదనలు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి గిరిజన గ్రామాల అభివృద్ధి, విద్యా సౌకర్యాల మెరుగుదల కోసం రూ.86 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ప్రతిపాదనలను అందజేశారు. గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యాలు కల్పించడం, రహదారుల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పన, నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు కీలక విజ్ఞప్తులు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి పినపాక నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పలు కీలక ప్రతిపాదనలు సమర్పించారు. మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ప్రస్తుతం ఉన్న 100 పడకల నుంచి 150 పడకల ఆసుపత్రిగా స్థాయిని పెంచి, అవసరమైన వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, నిధులు కల్పించాలని కోరారు. అదేవిధంగా గుండాల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, సారపాకలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు, ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు తగ్గించి, స్థానికంగానే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ప్రతిపాదనలపై సానుకూల స్పందన

పినపాక నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమర్పించిన ప్రతిపాదనలపై రాష్ట్ర మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదిత అభివృద్ధి పనుల ప్రాధాన్యతను గుర్తించి, నిధుల మంజూరుకు త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సదుపాయాలు కల్పించడం, మౌలిక వసతుల విస్తరణకు నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే పినపాక నియోజకవర్గంలోని పలు గ్రామాలకు అభివృద్ధి పరంగా మరింత ప్రయోజనం చేకూరనుంది.

ప్రీ ప్రైమరీ పాఠశాల సమస్యలపై స్పందించిన తీన్మార్ మల్లన్న

- పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి
- విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ కట్టుబడి ఉంది
- జిల్లా టీఆర్పీ నాయకులు



✍ జయభేరి, సిద్దిపేట, నవంబర్ 23 :

విద్యా, వైద్య రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించే నాయకుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్దిపేట జిల్లా నాయకులు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చుంచునకోట గ్రామంలోని ప్రీ ప్రైమరీ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేవని, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు లేఖ ద్వారా తెలియజేశారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించిన తీన్మార్ మల్లన్న సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పిల్లలకు నాణ్యమైన విద్య అందాలంటే పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండటం అత్యవసరమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన వసతులు, ఇతర సౌకర్యాల కల్పన విషయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ స్పందన ప్రజల సమస్యలను ఏ క్షణమైనా తెలుసుకుని వాటి పరిష్కారానికి స్పందించే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సిద్దిపేట జిల్లా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు పాషా, జిల్లా ఉపాధ్యక్షులు పి.నర్సింగ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ బాబా, చేర్యాల మండల నాయకుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవేడు గ్రామ ప్రజా అవసరాలకు ఎకరం స్థలం కేటాయించాలని తహసీల్దార్ నివేదిక

- అమెజాన్‌కు భూముల కేటాయింపులో గ్రామ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.. కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ, ఇతర అభివృద్ధి పనులకు స్థలం కోరుతూ ప్రతిపాదన
- పెదవేడు గ్రామ సర్పంచ్ చక్కటి రాజసులోచన



✍ జయభేరి, షాబాద్, నవంబర్ 23 :

షాబాద్ మండలం పెద్దవేడు గ్రామంలోని ప్రభుత్వ భూముల కేటాయింపు విషయంలో గ్రామ ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని రెవెన్యూ అధికారులు ప్రతిపాదించారు. సర్వే నంబర్ 147లోని ప్రభుత్వ భూమిని టీజీఐఐసీ ద్వారా అమెజాన్ సంస్థకు డేటా సెంటర్ ఏర్పాటుకు కేటాయించిన నేపథ్యంలో, గ్రామ ప్రజల అవసరాల కోసం ఒక ఎకరం భూమిని కేటాయించాలని గ్రామ సర్పంచ్ చక్కటి రాజసులోచన గ్రామస్తులు చేసిన విజ్ఞప్తిపై తహసీల్దార్ ఎండి అన్వర్, స్పందిస్తూ చేవెళ్ల ఆర్డీవోకు నివేదిక సమర్పించారు. గ్రామ సర్పంచ్ పెద్దవేడు గ్రామపంచాయతీ తరపున గత అక్టోబర్ 7న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తూ, గ్రామంలో ప్రజా అవసరాలకు సరిపడా స్థలం లేదని, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ భవనం, ఇతర సామాజిక అవసరాల కోసం ప్రభుత్వ భూమిలో ఒక ఎకరం కేటాయించాలని కోరారు. ఈ వినతికి సంబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్ స్థల పరిశీలన చేసి నివేదిక పంపించారు. సర్వే నంబర్ 147లో మొత్తం 10.07 ఎకరాల భూమిని టీజీఐఐసీకి కేటాయించగా, అందులో కొంత భాగాన్ని అమెజాన్ సంస్థకు డేటా సెంటర్ ఏర్పాటుకు కేటాయించినట్లు నివేదికలో పేర్కొన్నారు. రహదారికి ఆనుకుని ఉన్న చిన్న భూభాగంలో గ్రామ ప్రజలకు అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు ఒక ఎకరం స్థలం కేటాయించాలని, మిగిలిన భూమిని సంస్థకు అప్పగించేలా ప్రతిపాదించారు. గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు కూడా ప్రజా అవసరాలకు భూమి కేటాయించాలని కోరుతున్న నేపథ్యంలో, గ్రామానికి ఆనుకుని ఉన్న స్థలాన్ని కమ్యూనిటీ అవసరాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ తన నివేదికలో ఆర్డీవోకు సూచించారు. ఈ భూమి కేటాయింపుపై ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయంపై గ్రామ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





మాచనపల్లిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న బ్లెండ్ కలర్స్ కంపెనీ కాలుష్యం!

- మాచనపల్లిలో బ్లెండ్ కలర్స్ కం పెనీ కాలుష్యంపై గ్రామస్తుల ఆందోళన
- పర్యావరణం, ప్రజారోగ్యం , భద్రతకు ముప్పు కలిగిస్తున్నారని ఆరోపణ
- కం పెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సర్పంచ్ రాధా శేఖర్ విజ్ఞప్తి
- నెరెట్ల మహేందర్ గౌడ్, మాచన్పల్లి వెంకటేష్,

✍ జయభేరి, షాబాద్, నవంబర్ 23 :

షాబాద్ మండలం మాచనపల్లి గ్రామ పరిసరాల్లో బ్లెండ్ కలర్స్ కంపెనీ నుంచి వెలువడుతున్న పొగ, నల్లటి దుమ్ము, నీటి కాలుష్యంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పర్యావరణం, ప్రజల ఆరోగ్యం, భద్రతకు ముప్పు కలిగిస్తున్న కంపెనీ యాజమాన్యంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.గ్రామ సర్పంచ్ రాధా శేఖర్, అంతిరెడ్డిగూడెం మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కంపెనీ యాజమాన్యాన్ని కలిసి తమ సమస్యలను వివరించారు. కంపెనీనుంచి వెలువడుతున్న పొగ,నల్లటి దుమ్ము అంతిరెడ్డిగూడెం గ్రామ పరిసరాలకు వ్యాపిస్తోందని,నీరు కలుషితమవుతోందని,పంట పొలాలు ఎర్రబారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కాలుష్య సమస్యను నియంత్రించి గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని,అవసరమైతే కంపెనీ కార్యకలాపాలను నిలిపివేయాలని యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పర్యావరణానికి మరింత హాని కలగకుండా అధికారులు స్పందించి కంపెనీపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.



సముద్రాల లక్ష్మమ్మ మృతి చాలా బాధాకరం



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ టీ న్యూస్ రిపోర్టర్ సముద్రాల వేణు అమ్మ సముద్రాల లక్ష్మమ్మ అకాల మరణాన్ని చింతిస్తూ దేవరకొండ లోని వారి నివాసానికి చేరుకొని సముద్రాల లక్ష్మమ్మ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్. ఈ కార్యక్రమంలో కేతావత్ హరి నాయక్, నీల సంజీవ్ కుమార్ జైపాల్ నాయక్ శివ, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ సర్పంచు అభ్యర్థిగా హేమలత తిప్పేస్వామి నామినేషన్ దాఖలు



✍ జయభేరి, అగళి, నవంబరు 23 :

అగళి మండలంలోని మధూడి పంచాయితి తెలుగుదేశం పార్టీ సర్పంచు అభ్యర్థి హేమలత తిప్పేస్వామి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. తెదేపా నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. అభ్యర్థి హేమలత తిప్పేస్వామి మాట్లాడుతూ ఈ స్థానిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి, మన గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి విజయానికి కృషి చేయాలని కోరారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనులు గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

మీ ఓటుతో నన్ను ఆశీర్వదించండి

- అగళి పంచాయితి తెలుగుదేశం పార్టీ సర్పంచు అభ్యర్థి ఆర్.మారుతి
- తెదేపా నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు



✍ జయభేరి, అగళి, నవంబరు 23 :

అగళి మండలంలోని అగళి పంచాయితి తెలుగుదేశం పార్టీ సర్పంచు అభ్యర్థిగా ఆర్.మారుతి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. తెదేపా నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆర్.మారుతి తన సొంత గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి తనకు ఒక అవకాశం కల్పించి, సర్పంచ్‌గా గెలిపించాలని కోరారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడతానని తెలిపారు.



మోడల్ పంచాయితీగా తీర్చిదిద్దడమే నా ప్రధాన ధ్యేయం

- మీ అందరి ఆశీస్సుతో సర్పంచు అభ్యర్థిగా మీ ముందుకొస్తున్నాను... ఓటు వేసి వేయించి గెలిపించండి
- కొమరేపల్లి తెదేపా సర్పంచు అభ్యర్థి చిక్కపయ్య నామినేషన్ దాఖలు

✍ జయభేరి, అగళి, నవంబరు 23 :

అగళి మండలం కొమరేపల్లి తెలుగుదేశం పార్టీ సర్పంచు అభ్యర్థిగా చిక్కపయ్య సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మోహన్ రావుకు నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. చిక్కపయ్య మాట్లాడుతూ మన ఊరి పంచాయితి ఎన్నికల సందర్భంగా మీ అందరి ఆశీస్సుతో సర్పంచు అభ్యర్థిగా మీ ముందుకొస్తున్నాను పదవులు అనుభవించడానికి కాదు, మన ఊరి ప్రజలకు సేవ చేయడానికి, గ్రామ రూపురేఖలు మార్చడానికే నా అడుగు అన్నారు. మన పంచాయతీలో ఇంకా తీరని సమస్యలు ఎన్నో ఉన్నాయి. వాటికి శాశ్వత పరిష్కారం చూపి, మన గ్రామాన్ని ఒక మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దడమే నా ప్రధాన ధ్యేయం అన్నారు. పంచాయితీలోని ఓటర్లు అందరూ నాకు ఓటు వేసి వేయించి మెజారిటీతో గెలిపించాలన్నారు.

ఆశీర్వదించి ఓటేయండి..
అభివృద్ధి చేసి చూపిస్తాం...

- నరసంబూది తెదేపా సర్పంచ్ అభ్యర్థిగా హెచ్.జి. గోవిందరాజు నామినేషన్ దాఖలు



✍ జయభేరి, అగళి, నవంబరు 23 :

మండలంలోని నరసంబూది గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా హెచ్.జె.గోవిందరాజు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కే.సుబ్బారావుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరాజు మాట్లాడుతూ నరసంబూది, జి.జి.పల్లి గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల సమస్యల పరిష్కారించడానికి నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో నాకు అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించాలని గ్రామ ప్రజలను కోరారు.

బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా రవి భూషణ్ నామినేషన్ దాఖలు



✍ జయభేరి, రొళ్ల, నవంబర్23:

రొళ్ల మేజర్ గ్రామ పంచాయతీ బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా సీనియర్ నాయకులు రవి భూషణ్ నామినేషన్ సమర్పించారు. సోమవారం ఆయన తన మద్దతుదారులతో కలిసి వెళ్లి స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు గ్రామపంచాయతీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపట్ల సంపూర్ణ అవగాహన ఉందని తనకు ఓట్లు వేసి గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామపంచాయతీ అభివృద్ధి లక్ష్యంగా అందరి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాపై అఖిలపక్ష సమావేశం



✍ జయభేరి, మేడిపల్లి :

బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన కల్పించేందుకు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వివరాలను తెలియజేస్తూ, సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో హెల్ప్ డెస్క్ కేంద్రాల ఏర్పాటు, ప్రజలకు అందించాల్సిన సేవలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, కొత్త కిషోర్ గౌడ్, ముదిగొండ రమేష్, బచ్చరాజు, పిట్టల మల్లేష్, మహేశ్వరప్ప, నీలారపు అయిలయ్య యాదవ్ తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



కార్తీక దీపం..
ఆధ్యాత్మిక వెలుగుల వెనుక అసలు పరమార్థం!

- ఉసిరి దీపం, దీపదానం వెనుక విశిష్టత ఏమిటి? ఎక్కడ, ఎలా దీపాలు వెలిగించాలి? కార్తీక మాసంలో పాటించాల్సిన నియమాలివే!

హిందూ సంప్రదాయంలో కార్తీక మాసానికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. శివకేశవులకు ప్రీతిపాత్రమైన మాసంగా భావించే ఈ పవిత్ర సమయంలో పూజలు, ప్రతాలు, ఉపవాసాలు, దానధర్మాలతో పాటు దీపారాధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. కార్తీక మాసం ప్రారంభమైందంటే ప్రతి ఇంటా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుంది. తెల్లవారుజామున కార్తీక స్నానాలు, సాయంత్రం వేళ తులసి కోట ముందు మట్టి ప్రమిదల్లో దీపాలు, ఆలయాల్లో హరిహరుల నామస్మరణతో భక్తిపారవశ్యం కనిపిస్తుంది. అయితే ఈ మాసంలో దీపం వెలిగించడం వెనుక ఉన్న ఆధ్యాత్మిక అంతరార్థం ఏమిటి? ఉసిరి దీపం, దీపదానం ఎందుకు చేయాలి? ఎక్కడ, ఎలా దీపారాధన చేయాలి?



అజ్ఞాన చీకట్లను తొలగించే జ్ఞానజ్యోతి

కార్తీక మాసంలో దీపారాధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడటానికి అనేక ఆధ్యాత్మిక కారణాలు ఉన్నాయి. కృత్తికా నక్షత్రంతో సంబంధం కలిగిన ఈ మాసంలో అగ్ని తత్వానికి విశేష స్థానం ఉందని సంప్రదాయాలు చెబుతాయి. శ్రీమహావిష్ణువును దామోదరునిగా, పరమశివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ దీపం వెలిగించడం అనవాయితీగా వస్తోంది. దీపం కేవలం చీకటిని తొలగించే సాధనం మాత్రమే కాదు.. మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానమార్గంలో నడిపించే ఆధ్యాత్మిక సంకేతంగా భావిస్తారు. ఉదయం సూర్యోదయానికి ముందే ఆవు నెయ్యితో, సాయంత్రం వేళ నువ్వుల నూనెతో దీపం వెలిగించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. ముఖ్యంగా సంధ్యా సమయంలో ఇంటి గుమ్మం, తులసికోట, పూజా మందిరం వద్ద దీపారాధన చేయడం శుభప్రదమని భక్తుల విశ్వాసం.

ఉసిరి దీపానికి ఎందుకంత ప్రత్యేకత?

కార్తీక మాసంలో ఉసిరి దీపం వెలిగించడం అత్యంత విశిష్టమైన ఆచారంగా భావిస్తారు. ఉసిరి చెట్టును పవిత్రమైనదిగా పరిగణించడంతో పాటు, దానిని శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైనదిగా సంప్రదాయాలు పేర్కొంటాయి. కార్తీక పౌర్ణమి, కార్తీక ద్వాదశి వంటి పర్వదినాల్లో ఉసిరికాయలపై దీపాలు వెలిగించి పూజించడం విశేషంగా ఆచరిస్తారు. ఉసిరి దీపం జ్ఞానం, వైరాగ్యం, ఆధ్యాత్మిక చింతనకు ప్రతీకగా భావిస్తారు. ఉసిరి చెట్టు సమీపంలో దీపం వెలిగించి శ్రీహరిని స్మరించడం ద్వారా భగవంతుని అనుగ్రహం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఈ ఆచారం ప్రకృతిని గౌరవించడం, పర్యావరణంతో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేయడం వంటి సందేశాలను కూడా అందిస్తుంది.

దీపదానం.. పుణ్యప్రదమైన ఆచారం

కార్తీక మాసంలో దీపదానానికి కూడా ఎంతో ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా కార్తీక పౌర్ణమి రోజున దీపదానం చేయడం విశేష ఫలప్రదమని ధార్మిక సంప్రదాయాలు చెబుతున్నాయి. వెండి లేదా రాగి పళ్లెంలో బియ్యం పోసి, అందులో దీపాలను వెలిగించి, ఉసిరికాయలను ఉంచి వాటిపై నెయ్యితో తడిపిన వత్తులను వెలిగించడం కొన్ని ప్రాంతాల్లో ఆచారంగా కొనసాగుతోంది. అనంతరం సంకల్పం చెప్పుకొని, దక్షిణతో సహా ముత్తయిదువులకు లేదా అర్హులైన వారికి దీపదానం చేస్తారు. ఆలయాల్లో కూడా స్వామివారి సన్నిధిలో దీపాలు వెలిగించవచ్చు. దీపంలో ఉపయోగించే వత్తుల సంఖ్యను బట్టి వివిధ ఫలితాలు కలుగుతాయని సంప్రదాయ విశ్వాసాలు ఉన్నాయి. రెండు వత్తులు శాంతికి, మూడు వత్తులు ధనవృద్ధికి, నాలుగు వత్తులు ఐశ్వర్యానికి, ఐదు వత్తులు అఖండ ఐశ్వర్యానికి, ఏడు వత్తులు మోక్షప్రాప్తికి సంకేతాలుగా పేర్కొంటారు.

పంచభూతాల సమ్మేళనం.. దీపం

దీపాన్ని పంచభూతాలకు ప్రతీకగా ఆధ్యాత్మికంగా వివరిస్తారు. మట్టి ప్రమిద భూమికి, అందులోని నూనె లేదా నెయ్యి నీటికి, వత్తి ఆకాశానికి, జ్వాల అగ్నికి, జ్వాల ప్రజ్వలనకు తోడ్పడే గాలి వాయువుకు సంకేతాలుగా భావిస్తారు. అందుకే మట్టి ప్రమిదలో దీపం వెలిగించడం ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తుందని పెద్దలు చెబుతారు. మట్టి ప్రమిదలో నువ్వుల నూనె లేదా ఆవు నెయ్యి పోసి, పత్తి వత్తిని వేసి దీపం వెలిగించడం సంప్రదాయ పద్ధతి. దీప జ్యోతిని చూస్తూ మనసులోని చెడు ఆలోచనలు తొలగి, సద్బుద్ధి, సానుకూలత పెరగాలని ప్రార్థించడం ఈ ఆచారం వెనుక ఉన్న అంతరార్థం.

కార్తీక మాసంలో ఎక్కడ దీపాలు వెలిగించాలి?

కార్తీక మాసంలో ప్రతిరోజూ సాయంత్రం కింది ప్రదేశాల్లో సంప్రదాయం, స్థానిక ఆచారాల ప్రకారం దీపారాధన చేయవచ్చు.

- ఇంటి పూజా మందిరంలో.
- తులసి కోట దగ్గర.
- ఇంటి ప్రధాన ద్వారం వద్ద.
- శివాలయాల్లో అనుమతించిన ప్రదేశాల్లో.
- శ్రీమహావిష్ణువు ఆలయాల్లో.
- ఉసిరి చెట్టు సమీపంలో, సంప్రదాయ పూజా విధానం ప్రకారం.

కార్తీక మాసంలో పాటించాల్సిన నియమాలు

ఈ పవిత్ర మాసంలో కేవలం దీపారాధనకే పరిమితం కాకుండా జీవన విధానంలోనూ కొన్ని నియమాలను పాటించాలని ధార్మిక సంప్రదాయాలు సూచిస్తున్నాయి.

- బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి స్నానం చేసి పరిశుభ్రమైన వస్త్రాలు ధరించాలి.
- కార్తీక స్నానానికి ప్రాధాన్యతనిస్తూ భక్తిశ్రద్ధలతో భగవంతుడిని ప్రార్థించాలి.
- ఉదయం, సాయంత్రం దీపారాధన చేయాలి.
- సాత్వికాహారం తీసుకుంటూ మద్యపానం, మాంసాహారానికి దూరంగా ఉండాలి.
- కోపం, అసూయ, ద్వేషం వంటి భావాలను తగ్గించుకొని మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి.
- పేదలకు అన్నదానం, వస్త్రదానం చేయాలి.
- పశుపక్ష్యాదులకు ఆహారం, నీరు అందించాలి.
- ఇతరులను బాధపెట్టకుండా మాట్లాడటం, అవసరమైన వారికి సహాయం చేయడం అలవర్చుకోవాలి.

శివకేశవుల ఆరాధనకు ప్రత్యేక మాసం

కార్తీక మాసంలో పరమశివుడికి అభిషేకం చేసి బిల్వదళాలు సమర్పిస్తూ పంచాక్షరి మంత్రాన్ని జపించడం విశేషంగా భావిస్తారు. శ్రీమహావిష్ణువుకు తులసీదళాలు, పుష్పాలు సమర్పించి విష్ణు సహస్రనామం, నారాయణ మంత్రాన్ని పఠిస్తారు. తులసి కోట వద్ద దీపం వెలిగించి పూజించడం, ఉసిరి చెట్టు సమీపంలో శ్రీహరిని స్మరించడం కూడా సంప్రదాయంలో భాగమే. కుటుంబ శ్రేయస్సు కోసం సత్యనారాయణ స్వామి వ్రతం చేయడం, ఆలయాల్లో భజనలు, భక్తి కార్యక్రమాల్లో పాల్గొనడం మంచిదని భక్తులు విశ్వసిస్తారు.

చిన్న దీపం.. గొప్ప సందేశం!

కార్తీక మాసంలో వెలిగించే ప్రతి దీపం మనిషికి ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. వెలుగు ఉన్నచోట చీకటికి స్థానం ఉండనట్లే.. జ్ఞానం ఉన్నచోట అజ్ఞానానికి, ప్రేమ ఉన్నచోట ద్వేషానికి, మంచితనం ఉన్నచోట చెడుకు తావుం డకూడదన్నదే దీపారాధనలోని అంతరార్థం. భక్తిశ్రద్ధలతో వెలిగించే చిన్న దీపమైనా మనసులో మంచి ఆలోచనలకు, సేవాభావానికి, ఆధ్యాత్మిక చింతనకు బాటలు వేయాలి.

"దీపం జ్యోతిః పరబ్రహ్మ.. దీపం సర్వతమోపహమ్.." అంటూ పెద్దలు చెప్పిన మాటల్లోని పరమార్థం ఇదే. కార్తీక మాసంలో ఒక్క దీపమైనా భక్తితో వెలిగించి, మన జీవితాల్లో జ్ఞానజ్యోతిని నింపుకోవడంతో పాటు మానవత్వం, దయ, ధర్మం అనే వెలుగులను సమాజమంతా విస్తరింపజేద్దాం.





వైసిపి సర్పంచ్ అభ్యర్థిగా తిమ్మక్క

✍ జయభేరి, రొళ్ల, నవంబర్ 23 :

మండలంలోని హోంట్టే బెంట్ట పంచాయతీ సర్పంచ్ స్థానానికి వైసిపి పార్టీల తరపు అభ్యర్థిగా తిమ్మక్క నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆమె కార్యకర్తలతో కలిసి నామినేషన్ కేంద్రానికి వెళ్లి సంబంధిత పత్రాలను అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయితీ ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

- ఉప్పల్ సర్కిల్‌లో ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు
- డిప్యూటీ కమిషనర్, ఉప్పల్ సర్కిల్

✍ జయభేరి, ఉప్పల్ :

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు వివిధ వార్డులలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది.

కేంద్రాల వివరాలు

చిల్కానగర్, కళ్యాణపురి కమ్యూనిటీ హాల్, బీరప్పగడ్డ, బ్యాంక్ కాలనీ కమ్యూనిటీ హాల్, హబ్సిగూడ, జె.ఎస్.ఎన్. నగర్ వెస్ట్, రామంతాపూర్, గాంధీనగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, వెంకట్ రెడ్డి నగర్, వివేక్ నగర్ కమ్యూనిటీ హాల్, ఉప్పల్, శాంతినగర్ కమ్యూనిటీ హాల్, ఉప్పల్, సూర్యనగర్ కమ్యూనిటీ హాల్. ఈ కేంద్రాలలో సంబంధిత ఇన్‌చార్జి అధికారులు, సహాయక సిబ్బంది, ఆపరేటర్లను నియమించి, ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రజలు తమకు సమీపంలోని కేంద్రాలను సందర్శించి, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన సేవలను వినియోగించుకోగలరు.

చేతకాని సీఎం రేవంత్

- రాజమండ్రిలో కవిత



✍ జయభేరి, రాజమండ్రి, నవంబరు 23 :

అనుమతులు లేకుండానే కృష్ణా నీటిని ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతోందని రాజమండ్రిలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రభుత్వ అసమర్థత కారణంగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోతోందని టీఆర్ఎస్ నాయకురాలు కవిత ఆరోపించారు. తన స్నేహితురాలిని పరామర్శించేందుకు రాజమండ్రి వచ్చిన ఆమె, మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ మధ్య కొనసాగుతున్న కృష్ణా నీటి వివాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టం ప్రకారం ఇరు రాష్ట్రాల మధ్య నీటి వనరుల పంపిణీ జరగాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఆ ప్రక్రియ పూర్తి కాలేదని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నీటిని తరలించుకుపోతోందని విమర్శించిన కవిత, ఈ విషయంలో ఆంధ్రా నాయకులను తప్పుబట్టే కంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అచేతన, నిస్సహాయ స్థితిని రాష్ట్ర ప్రజలు నిలదీస్తున్నారని అన్నారు. కేఆర్ఎంబీ సమావేశం జరుగుతున్న రోజే కవిత చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన సమయంలోనే నిబంధనల ప్రకారం, అపెక్స్ కౌన్సిల్ సూచించే విధానాల మేరకు నడుచుకోవాలని నిర్ణయించుకున్నామని గుర్తుచేశారు. ఆ విధంగా సరైన పద్ధతిలో నీటి పంపకాలు చేసుకుంటే రెండు రాష్ట్రాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని చంద్రబాబును కోరారు. రాష్ట్రాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని, నిబంధనల ప్రకారం నీటిని వినియోగించుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదని స్పష్టం చేశారు. అయితే, కేంద్రంలో బీజేపీతో పొత్తులో ఉన్నామనే ధీమాతో తెలంగాణ నీటి వనరులను కొల్లగొట్టాలని చూస్తే మాత్రం మళ్లీ ఇరు రాష్ట్రాల మధ్య తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితి వస్తుందని కవిత హెచ్చరించారు.



అప్పుడప్పుడు ఓ సిగరెట్ తాగితే ఏమవుతుందిలే అనుకుంటున్నారా..?

సిగరెట్ అంటే ఏళ్ల తరబడి తాగితేనే ప్రమాదం వస్తుందని చాలామంది భావిస్తుంటారు. ఇప్పుడే మొదలుపెట్టాను.. ఇంకా పెద్దగా ఏమీ కాలేదు, రోజుకు ఒకటో రెండో మాత్రమే.. దాంతో ఏమవుతుందిలే.. అంటూ తమను తాము సమర్థించుకునేవారూ ఉంటారు. మరికొందరు పార్టీల్లో లేదా స్నేహితులతో కలిసినప్పుడు మాత్రమే సిగరెట్ తాగుతామని, తమకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అనుకుంటారు. కానీ సిగరెట్ పొగ శరీరంలోకి వెళ్లిన తర్వాత ఎలాంటి మార్పులు మొదలవుతాయి.. హాని కనిపించడానికి నిజంగానే సంవత్సరాలు పడుతుందా.. ఈ విషయంపై జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కీలక విషయాలను వెల్లడించారు.

డాక్టర్ తెలిపిన వివరాల ప్రకారం..సిగరెట్ వల్ల కలిగే నష్టం బయటకు కనిపించే లక్షణాలు వచ్చినప్పుడే మొదలవుతుందని అనుకోవడం పొరపాటే. పొగను పీల్చిన వెంటనే శరీరం దానికి స్పందించడం ప్రారంభిస్తుంది. ముఖ్యంగా గుండె, రక్తనాళాలు, ఊపిరితిత్తులపై దాని ప్రభావం మొదలవుతుందని తెలిపారు. ప్రారంభంలో ఈ మార్పులు చాలా స్వల్పంగా ఉండొచ్చని, అందువల్ల వ్యక్తికి తాను ఆరోగ్యంగానే ఉన్నట్లు అనిపించవచ్చని చెప్పారు. ఇదే కారణంగా ఎలాంటి సమస్య లేదనే భావనతో చాలామంది ధూమపానాన్ని కొనసాగిస్తుంటారని వివరించారు. కానీ కాలం గడిచేకొద్దీ ఈ ప్రభావం క్రమంగా పెరిగి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చని హెచ్చరించారు. కొద్దిపాటి ధూమపానం చేసినా శరీరంలో కొన్ని తక్షణ మార్పులు చోటుచేసుకోవచ్చని తెలిపారు. సిగరెట్‌లోని నికోటిన్ కారణంగా గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు పెరగవచ్చని చెప్పారు. అదే సమయంలో పొగ ఊపిరితిత్తుల్లోకి చేరడం వల్ల అక్కడ చికాకు, వాపు వంటి మార్పులు కూడా మొదలయ్యే అవకాశం ఉందన్నారు. నిరంతరంగా ధూమపానం చేయడం వల్ల ఈ ప్రభావాలు పదేపదే చోటుచేసుకుని క్రమంగా ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలపై భారాన్ని పెంచుతాయని వివరించారు. అందుకే దగ్గు, ఆయాసం, ఛాతీలో అసౌకర్యం వంటి లక్షణాలు కనిపించకపోయినా.. ధూమపానం వల్ల శరీరానికి ఎలాంటి ప్రభావం లేదని భావించకూడదని చెబుతున్నారు.

రోజుకు ఒక్క సిగరెట్ మాత్రమే.. అప్పుడప్పుడు మాత్రమే తాగుతాను అనే వారు కూడా పూర్తిగా సురక్షితమైనది కాదని డాక్టర్ స్పష్టం చేశారు. ధూమపానానికి హాని లేని మోతాదు అంటూ ఏదీ లేదని తెలిపారు.సిగరెట్ల సంఖ్య పెరిగే కొద్దీ ప్రమాదం పెరుగుతుందనేది నిజమే అయినప్పటికీ.. తక్కువగా తాగడం వల్ల ప్రమాదం పూర్తిగా తొలగిపోదన్నారు. నిరంతర దగ్గు, మెట్లు ఎక్కేటప్పుడు సాధారణం కంటే ఎక్కువగా ఆయాసం రావడం, త్వరగా అలసిపోవడం, తరచుగా ఛాతీ ఇన్ఫెక్షన్లు రావడం, గొంతులో చికాకు వంటి మార్పులను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ముఖ్యంగా ఛాతీ నొప్పి లేదా విశ్రాంతి సమయంలోనే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అయితే ధూమపానం చేసే వారికి ఒక మంచి విషయం కూడా ఉందని తెలిపారు. సిగరెట్ మానేసిన తర్వాత శరీరం కోలుకునే ప్రక్రియను ప్రారంభిస్తుందని చెప్పారు. కాలక్రమేణా గుండె, రక్తనాళాలు, ఊపిరితిత్తులపై ధూమపానం వల్ల ఏర్పడే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. ఎంత త్వరగా మానేస్తే అంత ఎక్కువ ప్రయోజనం ఉంటుందని, అయితే చిన్నవయసులో మానలేకపోయినా ఏ వయసులో మానేసినా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. కాబట్టి ఇప్పుడైతే ఏమీ కాలేదు అనే ఆలోచనతో ధూమపానాన్ని కొనసాగించడం కంటే.. వీలైనంత త్వరగా ఆ అలవాటుకు దూరంగా ఉండటమే భవిష్యత్ ఆరోగ్యానికి మంచిదని సూచించారు.

(గమనిక: ఈ కథనం వైద్యులు అందించిన సాధారణ సమాచారం ఆధారంగా రాసినది. దీనిని ధృవీకరించడం లేదు.)



హెల్త్‌కి మంచిదని పరగడుపున తులసి ఆకులు తింటున్నారా..

వామ్మో.. వాళ్లు తింటే తిరిగి హాస్పిటల్‌కు వెళ్లాల్సిందే

భారతీయ సంస్కృతిలో తులసి మొక్కకు ప్రత్యేక స్థానం ఉంది. పూజలు, ఆధ్యాత్మిక ఆచారాలతో పాటు శతాబ్దాలుగా సంప్రదాయ ఆయుర్వేద వైద్యంలోనూ తులసిని ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ఉదయాన్నే పరగడుపున కొన్ని తులసి ఆకులు నమిలి తింటే ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని చాలామంది నమ్ముతుంటారు. అయితే తులసి నిజంగానే అన్ని రకాల అనారోగ్యాలను దూరం చేస్తుందా? రోజూ నాలుగు ఆకులు తింటే సరిపోతుందా? అనే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. తులసి ఆకుల్లో విటమిన్లు, ఖనిజాలతో పాటు యూజినాల్ వంటి వృక్ష రసాయన సమ్మేళనాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఏర్పడే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటంలో, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అందుకే తులసిని ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో భాగంగా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియకు తులసి ఉపయోగకరమా? సంప్రదాయ వైద్యంలో తులసి ఆకులను అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి స్వల్ప జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం కోసం ఉపయోగిస్తారు. అయితే తీవ్రమైన మలబద్ధకం లేదా గ్యాస్ట్రిక్ సమస్యలను తులసి మాత్రమే పూర్తిగా నయం చేస్తుందని చెప్పడానికి తగిన శాస్త్రీయ ఆధారాలు లేవు. కాబట్టి తీవ్రమైన సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించడం అవసరం. తులసిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇవి గొంతు నొప్పి, సాధారణ జలుబు వంటి స్వల్ప సమస్యల్లో కొంత ఉపశమనం కలిగించవచ్చు. అయితే ఆస్తమా లేదా తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు వైద్య చికిత్సకు బదులుగా తులసిని ఉపయోగించకూడదు. ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుందా? తులసిని సహజసిద్ధమైన అడాప్టోజెన్‌గా పరిగణిస్తారు. కొన్ని అధ్యయనాల ప్రకారం తులసి మానసిక ఒత్తిడి, ఆందోళన లక్షణాలను తగ్గించడంలో సహాయపడే అవకాశం ఉంది. అలాగే శరీర సహజ రోగనిరోధక వ్యవస్థకు తులసిలోని పోషకాలు తోడ్పడవచ్చని భావిస్తున్నారు. రోజూ 4 ఆకులు తప్పనిసరిగా తినాలా? ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు రోజుకు 3-4 తాజా తులసి ఆకులను తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉండవచ్చని ఈ నివేదిక పేర్కొంటోంది. అయితే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా రోజూ నాలుగు ఆకులే తినాలనే వైద్యపరమైన నియమం లేదు. తులసిని మోతాదుకు మించి ఔషధంలా తీసుకోవడం కూడా సరైన పద్ధతి కాదు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు తులసిని ఔషధ మోతాదులో తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి. దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్నవారు లేదా క్రమం తప్పకుండా మందులు వాడేవారు కూడా అధికంగా తులసిని తీసుకోకూడదు. ముఖ్యంగా తులసి ప్రధాన వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం, సమతుల్య జీవనశైలి, అవసరమైనప్పుడు సరైన వైద్య చికిత్సతో పాటు తులసిని ఉపయోగించడం మంచిది.



కొబ్బరిబొండంలా ఉన్న పొట్ట ఇట్టే కరిగిపోవాల్సిందే. !

శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. దైనందిన జీవితంలో కొన్ని సాధారణ అలవాట్లను మార్చుకోవడం ద్వారా సులభంగా బరువు తగ్గవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

డైలీ రొటీన్‌లో కొన్ని ప్రత్యేకమైన చిట్కాలను పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. ఉదయం సమయంలో తీసుకునే ఆహారం నుంచి రాత్రి పడుకునే వరకు కొన్ని నియమాలను పాటించడం చాలా అవసరం. ఉదయం పూట తీసుకునే అల్పాహారంలో గుడ్లు, చియా గింజలు, అవిసె గింజలు, పీనట్ లేదా ఆల్మండ్ బట్టర్, బాదం అలాగే వాల్‌నట్స్ వంటివి ఉండేలా చూసుకోవాలి.

వీటిలో మంచి కొవ్వులు ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి తగిన శక్తి లభిస్తుంది. దీనివల్ల రక్తంలోని షుగర్ లెవెల్స్ అన్నీ అదుపులో ఉంటాయి. అలాగే రోజువారీ జీవితంలో నడకను ఒక అలవాటుగా మార్చుకోవడం ఎంతో ముఖ్యం. రోజూ పది వేల నుంచి పన్నెండు వేల స్టెప్స్ నడిస్తే శరీరంలోని అదనపు క్యాలరీలు వేగంగా బర్న్ అవుతాయి.

ఆహారంలో ఫైబర్ శాతం ఎక్కువగా ఉండేలా చూసుకోవడం బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తుంది. పీచు పదార్థం జీర్ణవ్యవస్థను మెరుగుపరచడమే కాకుండా త్వరగా ఆకలి వేయకుండా నియంత్రిస్తుంది. దీనితో పాటు రాత్రి సమయంలో భోజనం చేసే వేళలపై కూడా శ్రద్ధ పెట్టాలి.

సాధారణంగా రాత్రి నిద్రపోయేదానికంటే కనీసం నాలుగు గంటల ముందే డిన్నర్ పూర్తి చేయడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ చిన్నపాటి జీవనశైలి మార్పులు బరువు తగ్గాలనుకునే వారికి ఎంతగానో సహాయపడతాయి.





యాపిల్ మ్యాప్స్‌లో కనిపించిన 'వారణాసి' భారీ కాశీ సెట్..

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా నుంచి వచ్చే ప్రతి చిన్న అప్‌డేట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీస్తోంది. తాజాగా ఈ చిత్ర షూటింగ్ కోసం హైదరాబాద్‌లో నిర్మించిన భారీ కాశీ సెట్‌కు సంబంధించిన ఏరియల్ వ్యూ నెట్టింట వైరల్‌గా మారింది. ఇండియాలో ఇటీవల అప్‌డేట్ అయిన యాపిల్ మ్యాప్స్ ద్వారా ఈ సెట్‌ను గుర్తించిన నెటిజన్లు, దాని భారీ నిర్మాణాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. 'వారణాసి' సినిమా కోసం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో అత్యంత భారీ స్థాయిలో కాశీ నగరాన్ని తలపించే సెట్‌ను నిర్మించినట్లు తెలుస్తోంది. ఇందులో పురాతన ఆలయాలు, గంగానది ఘాట్లను పోలిన నిర్మాణాలు, నగర వీధులు ఇలా అనేక అంశాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించారు.

తాజాగా యాపిల్ మ్యాప్స్‌లో ఈ ప్రాంతానికి సంబంధించిన ఏరియల్ చిత్రాలు అప్‌డేట్ కావడంతో, సినిమా సెట్‌ను గుర్తించిన కొందరు నెటిజన్లు వాటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఈ సెట్ విస్తీర్ణం, నిర్మాణాల సంఖ్య, ప్రాచీన నగరాన్ని తలపించే విధానం చూసి అభిమానులు రాజమౌళి విజన్‌ను ప్రశంసిస్తున్నారు. సినిమా కోసం ఇంత భారీ స్థాయిలో సెట్స్ నిర్మించడం మరోసారి ఆయన సినిమాల మేకింగ్ స్టాండర్డ్స్‌ను తెలియజేస్తోందని కామెంట్లు చేస్తున్నారు. 'వారణాసి' భారతీయ పురాణాల నేపథ్యంతో రూపొందుతున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం. టైమ్ ట్రావెల్ అంశాలు కూడా ఇందులో కీలకంగా ఉండనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో మహేష్ బాబు 'రుద్ర' అనే పాత్రలో కనిపించనుండగా, ప్రియాంక చోప్రా 'మందాకిని'గా, పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' పాత్రలో నటిస్తున్నారు.

విభిన్న కాలాలు, పురాణ అంశాలు, భారీ యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ చిత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి గత చిత్రాల కంటే మరింత భారీ విజువల్ స్కేల్‌లో 'వారణాసి' ఉండబోతోందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారీ విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్, ఇతర సాంకేతిక పనులపై చిత్ర బృందం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ సినిమా కోసం రాజమౌళి అండ్ టీమ్ ప్రపంచ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని భారీ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమాను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భారీ సెట్స్, నటీనటుల లుక్, కథపై వస్తున్న ప్రచారంతో ఇప్పటికే గ్లోబల్ స్థాయిలో ఆసక్తి నెలకొంది.

షూటింగ్‌కి గ్రీన్‌సిగ్నల్?



అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో సినిమా రానున్నదనే వార్త బయటకు రాగానే అభిమానుల్లో భారీ అంచనాలు మొదలయ్యాయి. కొన్ని నెలల క్రితం ఏపీ రాజధాని అమరావతిలో ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని కూడా నిర్వహించారు. బాలయ్య 'దాదా' సినిమా షూటింగ్ బిజీగా ఉండటంతో ఈ విలువైన సమయాన్నంతా స్క్రిప్ట్‌కే కేటాయించారు కొరటాల. ఎట్టకేలకు బౌండ్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు. ఇటీవలే బాలకృష్ణకు డైలాగ్ వెర్షన్‌తో సహా స్క్రిప్ట్ మొత్తాన్ని వినిపించారట. బాలకృష్ణకూడా స్క్రిప్ట్ విని, షూటింగ్‌కి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట. పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందనున్నదని వినికిడి. కొరటాల హీరోలను చూపించే తీరు భిన్నంగా ఉంటుంది. అలాగే ఆయన సినిమాల్లో.. కథ కంటే కథా నేపథ్యమే ఎక్కువగా గుర్తొస్తుంది. ఏ ప్రాంతంలో అయితే కథ నడుస్తుందో ఆ ప్రాంతపు జీవన శైలిని బలంగా చూపిస్తారాయన. బాలయ్యతో చేయబోతున్న సినిమా నేపథ్యం కూడా బలంగా ఉంటుందని తెలిసింది. చెరుకూరి సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాల తెలియాల్సివుంది.



అచ్చు బుట్ట బొమ్మలా మారిపోయిన నిధి అగర్వాల్..

సవ్యసాచి సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి వచ్చిన నిధి అగర్వాల్.. ఆ తర్వాత అఖిల్‌తో మిస్టర్ మజ్నులో నటించింది. అక్కినేని సోదరులు ఇద్దరూ హ్యాండిచ్చినా కూడా ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సత్తా చూపించింది. ఈ యేడాది మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా కథానాయకుడిగా పరిచయమైన 'హీరో' మూవీతో పలకరించింది. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి ఫలితాన్ని అందుకుంది. నిధి అగర్వాల్ హాట్ షో అంతేకాదు ఇపుడున్న కథానాయికల్లో ఇంతలా రెచ్చిపోయి హాట్ చేయడం నిధి అగర్వాల్‌కు కలిసొచ్చే విషయం. అందాల నిధులను నమ్ముకునే ఈమె రంగంలోకి దిగిందంటున్నారు.



కుటుంబం జోలికొస్తే ఊరుకోను!

సినిమాల్లో తన నటన, కెరీర్‌కు సంబంధించిన అంశాల మీద ఎవరైనా అభిప్రాయాలను వ్యక్తం చేయొచ్చని, కానీ కుటుంబం గురించి మాట్లాడితే మాత్రం అస్సలు ఊరుకోనని అగ్ర కథానాయిక రష్మిక మందన్న స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. తాజా ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. ఇటీవల 'కాఫీ విత్ కరణ్ సీజన్ 9'లో పాల్గొన్నారు విజయ్ దేవరకొండ రష్మిక మందన్న. పెళ్లి చేసుకోమని విజయ్ దేవరకొండను తాను ఏడాది పాటు ప్రతి రోజూ అడిగానని రష్మిక చేసిన వ్యాఖ్యలపై సోషల్‌మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి. ఈ విషయంలో విజయ్‌రష్మిక దంపతులు సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించి కేసు పెట్టారు.

ఈ నేపథ్యంలో తన తాజా ఇంటర్వ్యూలో రష్మిక మందన్న ఈ వివాదంపై స్పందించింది. 'గతంలో సోషల్‌మీడియా పోస్ట్‌లపై స్పందించేదాన్ని కాదు. అందరికి సమాధానం చెప్పడం వ్యథా అనిపించేది. ఇప్పుడు కూడా మౌనంగానే ఉంటాను. కెరీర్‌పరంగా ఏమైనా మాట్లాడొచ్చు. నా కుటుంబం గురించి మాట్లాడితే మాత్రం నా తదుపరి చిత్రం 'మైసా'లో ఉన్నట్లు వారియర్‌లా మారిపోతా. ఎందుకంటే నా కుటుంబ సభ్యులకు సినిమాలతో ఏమాత్రం సంబంధం లేదు. అలాంటివారి వ్యక్తిత్వాన్ని కించపరచడం ఏమాత్రం సమంజసం కాదు' అని రష్మిక చెప్పింది. ఆమె తాజా చిత్రం 'మైసా' త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది.

డిసెంబర్ 11న థియేటర్లలో సందడి చేయనున్న 'ది బ్రేకింగ్ న్యూస్'!



తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు మరో ఆసక్తికరమైన చిత్రం సిద్ధమైంది. మీడియా రంగం నేపథ్యంలో రూపొందిన 'ది బ్రేకింగ్ న్యూస్' చిత్రం డిసెంబర్ 11, 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఓపెన్ స్కై క్రియేషన్స్ బ్యానర్‌పై హనుమంత రెడ్డి, ఉమా గుటూర్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకు పవన్ కడియాల రచన మరియు దర్శకత్వం వహించారు.

సీనియర్ నటుడు మురళీ మోహన్, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో సోనియా నాయుడు, ఆర్.కె. నాయుడు, వాసుదేవ్, ప్రేమ్ కృష్ణ, రవి ప్రకాష్, వాహిని తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు. వార్తా ప్రపంచంలోని అంతర్గత పరిణామాలు, మీడియా వ్యవస్థ నేపథ్యంలో సాగే ఉత్కంఠభరితమైన కథాంశంతో ఈ థ్రిల్లర్ చిత్రాన్ని తెరకెక్కించారు. గతంలో ఈ సినిమా ప్రారంభోత్సవంతో పాటు ఫస్ట్ లుక్‌ను మెగాస్టార్ చిరంజీవి ఆవిష్కరించగా, ఇటీవల నవంబర్ 20న టాలీవుడ్ హీరో సుమంత్ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. విడుదలైనప్పటి నుంచి ఈ ట్రైలర్ ప్రేక్షకుల నుంచి విశేష స్పందనను అందుకుంటూ సోషల్ మీడియాలో మంచి క్రేజ్ సంపాదించుకుంది.

ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పనిచేశారు. ఈ సినిమాకు శశి ప్రీతమ్ సంగీతం అందించగా, సైనాథ్ ఛాయాగ్రహణం, శిరీష్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. రేఖ బైరి, నరేన్ కె సహ నిర్మాతలుగా, రమణ రెడ్డి తాటిరెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. చీఫ్ అసోసియేట్ డైరెక్టర్‌గా బి.ఎన్. గణేష్ భట్, అసోసియేట్ డైరెక్టర్లుగా సంజీవ్ ధరణి, సాయి యోగేష్ పనిచేశారు.

సౌండ్ డిజైనర్‌గా జి. పురుషోత్తం రాజు, అసోసియేట్ ఎడిటర్‌గా శ్రీనివాస్ శాములేటి, ఫిల్మ్ వీడియో ఎడిటర్‌గా లూర్డు బాధ్యతలు నిర్వర్తించారు. రాకేష్ పట్వారీ, రోహన్ ఏటూరి, అర్చన టి.ఎన్. క్రియేటివ్ టీమ్‌గా, మిట్టు అరెట్టి పబ్లిసిటీ డిజైనర్‌గా పనిచేయగా, మధుర ఆడియో సంస్థ ఈ చిత్ర ఆడియో హక్కులను సొంతం చేసుకుంది. పీఆర్వోగా వీరబాబు వ్యవహరిస్తున్నారు.

ఆసక్తికరమైన కథాంశంతో రూపొందిన 'ది బ్రేకింగ్ న్యూస్' డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుండటంతో సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**